జాతీయ తెలుగు దినపత్రిక

# ప్రజాజ్యోతి

ప్రతి అక్షరం ప్రజల కోసం



## భద్రాద్రి కొత్తగూడెం

బుధవారం | 24 | జూన్ | 2026 • పేజీలు : 9


# ప్రజాపాలన ప్రగతి ప్రణాళికను నిరంతర ప్రక్రియగా కొనసాగించాలి

- అన్ని శాఖల కార్యక్రమాలపై ప్రత్యేక డాక్యుమెంటేషన్ రూపొందించాలి
- ప్రజా పాలన _ప్రగతి ప్రణాళిక జిల్లా ప్రత్యేక అధికారి శ్రీధర్

**కొత్తగూడెం కలెక్టరేట్, జూన్ 23, (ప్రజాజ్యోతి)** ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణలో భాగంగా జిల్లాలో వివిధ శాఖల ద్వారా చేపట్టిన కార్యక్రమాలపై మంగళవారం ఐడీఓసీ కార్యాలయ సమావేశ మందిరంలో ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక జిల్లా ప్రత్యేక అధికారి, నీటిపారుదల శాఖ కార్యదర్శి శ్రీధర్ ,జిల్లా కలెక్టర్ అంకిత్, ఐటీడీఏ ప్రాజెక్టు

మిగతా 2 లో...





8 లో..

## భద్రాద్రి మెచ్చిన కథ...

# పవన సుధ

ఎన్‌సీసీ (నేషనల్ క్యాడెట్ కార్ప్స్) అంటే కేవలం యూనిఫాం ధరించి పరేడ్ చేయడం మాత్రమే కాదు. అది క్రమశిక్షణకు పునాది, దేశభక్తికి ప్రతీక, నాయకత్వానికి నాంది. యువతలో బాధ్యత, సేవాభావం, ఆత్మవిశ్వాసం, దేశం పట్ల అంకితభావాన్ని పెంపొందిస్తూ భవిష్యత్ పౌరులను తీర్చిదిద్దే మహత్తర వేదిక. అలాంటి వ్యవస్థలో మహిళా అధికారిగా రాణించడం సాధారణ విషయం కాదు. కుటుంబ బాధ్యతలు, వృత్తిపరమైన ఒత్తిళ్లు, వ్యక్తిగత సవాళ్లను అధిగమిస్తూ తన చిన్ననాటి యూనిఫాం కలకు కొత్త అర్థాన్ని ఇచ్చి, వేలాది మంది విద్యార్థుల జీవితాలకు దిశానిర్దేశం చేస్తున్న అసోసియేట్ ఎన్‌సీసీ ఆఫీసర్ వి.యస్. పవన సుధ ప్రస్థానం నిజంగా స్ఫూర్తిదాయకం. తనకు నెరవేరని కలను నిరాశగా మిగలనివ్వకుండా, అదే కలను వేలాది మంది క్యాడెట్ల భవిష్యత్తుగా మలిచిన ఆమె జీవన ప్రయాణం పట్టుదల, క్రమశిక్షణ, సేవాభావానికి నిదర్శనం. ఒక ఉపాధ్యాయురాలిగా ప్రారంభమైన ఆమె ప్రస్థానం, నేడు యువతలో నాయకత్వ లక్షణాలను పెంపొందించే మార్గదర్శకురాలిగా ఎదిగింది. మహిళలు సంకల్పం, అంకితభావంతో ముందుకు సాగితే ఎంతటి బాధ్యతలనైనా విజయవంతంగా నిర్వర్తించగలరని నిరూపిస్తున్న పవన సుధ విజయ ప్రస్థానంపై ప్రజాజ్యోతి ప్రత్యేక కథనం.

• భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ప్రతినిధి, ప్రజాజ్యోతి

• యూనిఫాం కలకు ఎన్‌సీసీ రూపం • క్రమశిక్షణకు కమాండ్... క్యాడెట్లకు మార్గదర్శనం • నాయకత్వాన్ని తీర్చిదిద్దుతున్న మహిళా అధికారి • సవాళ్లను అవకాశాలుగా మలిచిన మహిళ • తరగతి గది నుంచి పరేడ్ మైదానం వరకు

# భద్రాద్రి ఆకాశయానానికి మార్గం సుగమం

- ప్రత్యామ్నాయ స్థలంపై కేంద్రం ఫోకస్
- 10 రోజుల్లో ఫీజిబిలిటీ రిపోర్టు.. వేగం పెంచిన కేంద్రం



**భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ప్రతినిధి, జూన్ 23, ప్రజాజ్యోతి:** దశాబ్దాలుగా భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ప్రజలు ఎదురుచూస్తున్న గ్రీన్‌ఫీల్డ్ ఎయిర్‌పోర్టు ప్రాజెక్టుకు మరోసారి ఆశాకిరణం కనిపించింది. సాంకేతిక కారణాలతో గతంలో ప్రతిపాదించిన రెండు స్థలాలు అనుకూలం కాదని తేలడంతో రాష్ట్ర ప్రభుత్వం కొత్త ప్రత్యామ్నాయ స్థలాన్ని గుర్తించి కేంద్రానికి ప్రతిపాదించింది.ఈ నేపథ్యంలో రాష్ట్ర మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, ఉత్తమ్‌కుమారరెడ్డి మంగళవారం న్యూఢిల్లీలో కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి కింజరాపు రాంమోహన్ నాయుడిని కలిసి భద్రాద్రి గ్రీన్‌ఫీల్డ్ ఎయిర్‌పోర్టు నిర్మాణంపై చర్చించారు.గతంలో ప్రతిపాదించిన ప్రాంతాలకు సమీపంలో విద్యుదీకృత రైల్వే మార్గాలు, కొండలు ఉండటంతో భద్రతా ప్రమాణాలు నెరవేరడం లేదని అధ్యయనాల్లో తేలిందని మంత్రి తుమ్మల వివరించారు. దీంతో కొత్తగా గుర్తించిన స్థలంపై సమగ్ర సాధ్యాసాధ్యాల నివేదిక సిద్ధం చేయాలని కేంద్రాన్ని కోరారు.ఈ ప్రతిపాదనపై స్పందించిన కేంద్ర మంత్రి రాంమోహన్ నాయుడు, సంబంధిత అధికారులకు

మిగతా 2 లో...

# అరుదైన బోరాకు భారీ డిమాండ్

- 'బోరా'.. కిలో ధర రూ.3 వేలు

2 లో...



# కెసిఆర్ స్కీములు పెడితే... రేవంత్ రెడ్డి స్కాములు చేస్తున్నాడు

- అచ్చంపేట నుండి అశ్వారావుపేట వరకు ఒకటే మాట
- కెసిఆర్ రావాలి... కాంగ్రెస్ పోవాలి
- అధికారమైనా ప్రతిపక్షమైన బిఆర్ఎస్ ది ప్రజల పక్షం
- కాంగ్రెస్ ప్రభుత్వం ఆశీర్వాద సభలు కాదు... క్షమాపణ సభలు పెట్టాలి
- రేవంత్ రెడ్డి ని ఆశీర్వదించాలట.. ఎందుకు రైతులను మోసం చేసినందుకా...?
- ఖమ్మం జిల్లాలో ముగ్గురు మంత్రులు ఉన్నా జిల్లాలో అభివృద్ధి శూన్యం
- సీతారామ కేసీఆర్ మానస పుత్రిక
- రాష్ట్రంలో ఏ గ్రామానికి అయినా వెళాం పూర్తి స్థాయిలో రుణమాఫీ అమలు జరిగిందని నిరూపించగలరా... పువ్వాడ అజయ్ కుమార్ మాజీ మంత్రి బిఆర్ఎస్ రాష్ట్ర నాయకులు

**అశ్వారావుపేట, జూన్ 23, ప్రజా జ్యోతి :** "కేసీఆర్ హయాంలో ప్రజా ఉపయోగకరమైన స్కీములు అమలు కాగా, ప్రస్తుత రేవంత్ రెడ్డి ముఖ్యమంత్రిగా కేవలం స్కాములకు తెరలేపారని, సింగరేణి, విద్యుత్ తో సహా అనేక సంస్థలలో అవినీతి రాజ్యమేలుతుందని బిఆర్ఎస్ రాష్ట్ర నాయకులు, మాజీ మంత్రి తన్నీరు హరీష్ రావు తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు.మంగళవారం అశ్వారావుపేట భద్రాచలం రోడ్ లోని శ్రీ శ్రీ కళ్యాణ వేదికలో "సార్" పై బిఆర్ఎస్ నాయకులకు,



కార్యకర్తలకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా హరీష్ రావు మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వంపై తనదైన స్టైల్ లో విమర్శల వర్షం కురిపించారు. అచ్చంపేట నుండి అశ్వారావుపేట వరకు రాష్ట్రవ్యాప్తంగా ప్రజలందరి నోటా ఒక్కటే మాట వినిపిస్తోందని, "కేసీఆర్ రావాలి... కాంగ్రెస్ పోవాలి" అని ప్రజలు

మిగతా 2 లో...

## కెసిఆర్ స్కీములు పెడితే రేవంత్ రెడ్డి స్కాములు చేస్తున్నాడు





(మొదటి పేజీ తరువాయి...)

కోరుకుంటున్నారని ఆయన పేర్కొన్నారు. అధికారంలో ఉన్నా, ప్రతిపక్షంలో ఉన్నా ఎల్లప్పుడూ ప్రజల పక్షాన నిలిచేది బిఆర్ఎస్ మాత్రమేనని స్పష్టం చేశారు.6 గ్యారంటీలంటూ నమ్మబలికి, అధికారంలోకి వచ్చాక వాటిని అమలు చేయడంలో పూర్తిగా విఫలమైన కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలకు మొహం చాటేస్తోందని, వారు నిర్వహించాల్సింది ఆశీర్వాద సభలు కాదని, ప్రజలకు క్షమాపణలు చెప్పే "క్షమాపణ సభలు" అని ఎద్దేవా చేశారు. 2023 అసెంబ్లీ ఎన్నికల్లో కృతజ్ఞతకు, ఆశకు మధ్య జరిగిన పోటీలో అప్పట్లో ఆశే గెలిచిందని, ప్రజలు కాంగ్రెస్ మాయమాటలను నమ్మి మోసపోయారన్నారు. కేసీఆర్ తన పాలనలో 11 విడతల్లో రూ. 73, వేల కోట్లు నేరుగా రైతుల ఖాతాల్లో వేసి ఆదుకున్నారని గుర్తుచేశారు. కానీ, ప్రస్తుత ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఒక్క రైతు బంధు కిందనే రైతులకు రూ. 29,350 కోట్లు బాకీ పడ్డారని ఆరోపించారు. ప్రతి మహిళకు రూ.2500 ఇస్తానన్నారని ఇప్పటివరకు లెక్కగడితే రాష్ట్రంలోని ప్రతి మహిళకు రూ.75 వేలు ఇవ్వాలన్నారు. రుణమాఫీ చేస్తామని నమ్మబలికిన కాంగ్రెస్ మాటలు నమ్మి, రైతులు బయట వడ్డీలకు తెచ్చి మరీ బ్యాంకుల్లో అప్పులు కడితే, తీరా ఇప్పుడు ప్రభుత్వం చేతులెత్తేసిందని మండిపడ్డారు. దీని వల్ల రైతులకు అప్పులే మిగిలాయని ఆవేదన వ్యక్తం చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత ఎస్టీ కార్పొరేషన్ కు రూ. 2750 కోట్లు ఎస్సీ కార్పొరేషన్ కు రూ.5400 కోట్లు బీసీ కార్పొరేషన్ కు రూ.13,070 కోట్లు కేటాయించి ఒక్క రూపాయి కూడా ఖర్చు చేయని దిక్కుమాలిన ప్రభుత్వం ఇదే అన్నారు. ఇవి మేము చెబుతున్న మాటలు కాదని అసెంబ్లీలో ఉప ముఖ్యమంత్రి ఆర్థిక శాఖ మంత్రి బట్టి విక్రమార్క వెల్లడించారన్నారు. దేవుడి సాక్షిగా ఒట్లు వేసి, అబద్ధపు హామీలతో రైతులను, బలహీన వర్గాలను మోసం చేసిన రేవంత్ రెడ్డి మొనగాడో లేక మోసగాడో ప్రజలే తేల్చుకోవాల్సిన సమయం వచ్చిందన్నారు. రైతులను నిలువునా ముంచినందుకు రేవంత్ రెడ్డిని ప్రజలు ఎందుకు ఆశీర్వదించాలని ఆయన ప్రశ్నించారు. కోటి మంది మహిళలను కోటీశ్వరుని చేస్తానన్న రేవంత్ రెడ్డి ఎంతమందిని కోటీశ్వరులు చేశారో నిలదీయాలని ప్రజలను కోరారు. రాష్ట్రంలో పాలనను గాలికొదిలేసిన రేవంత్ రెడ్డి అన్ని కీలక శాఖల్లోనూ పూర్తిగా ఫెయిల్ అయ్యారని కానీ ఢిల్లీ పెద్దలకు సంచులు మోసే శాఖలో మాత్రం ఆయన ఫస్ట్ క్లాస్‌లో పాస్ అయ్యారు" అని హరీష్ రావు ఎద్దేవా చేశారు. రైతు డిస్కామ్ ల నిర్ణయంతో రైతులకు తీవ్ర నష్టం వాటిల్లుతోందని అటువంటి తప్పుడు నిర్ణయాలను ప్రభుత్వం వెనక్కి తీసుకోవాలన్నార. ఖమ్మం జిల్లా నుండి ముగ్గురు మంత్రులు ప్రాతినిధ్యం వహిస్తున్నప్పటికీ జిల్లాలో అభివృద్ధి మాత్రం శూన్యంగా మారిందని ఆయన విమర్శించారు. రాష్ట్రంలో టిఆర్ఎస్ కార్యకర్తలపై పోలీసుల దౌర్జన్యం ఎక్కువైందని రాసి పెట్టుకోండి ఇబ్బంది పెట్టిన ఎవర్ని వదిలే ప్రసక్తే లేదని పదునైన వ్యాఖ్యలు చేశారు.

**సీతారామ కేసీఆర్ మానస పుత్రిక... పువ్వాడ....మాజీ మంత్రి**

ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాల పరిధిలోని సాగుభూములను సస్యశ్యామలం చేయాలనే ఉద్దేశంతోనే అప్పటి ముఖ్యమంత్రి కె. చంద్రశేఖర రావు (కేసీఆర్) ప్రతిష్టాత్మకంగా 'సీతారామ ఎత్తిపోతల పథకం' ప్రాజెక్టును ప్రారంభించారని, సీతారామ ప్రాజెక్టు కేసీఆర్ మానస పుత్రిక అని మాజీ మంత్రి, బిఆర్ఎస్ రాష్ట్ర నాయకులు అజయ్ కుమార్ అన్నారు. మంగళవారం అశ్వారావుపేటలో జరిగిన "సార్" పై కార్యకర్తలకు జరిగిన అవగాహన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ, ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వంపై తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. రైతాంగానికి ఎంతో మేలు చేస్తామని, అండగా ఉంటామని నమ్మబలికి అధికారంలోకి వచ్చిన వాళ్లు ప్రస్తుతం రైతులకు చేసిందేమీ లేదని, కనీసం 'దమ్మిడి' పని కూడా చేయలేదని పువ్వాడ విమర్శించారు. కేవలం మాటలకే పరిమితమవడమే తప్ప, క్షేత్రస్థాయిలో రైతు సంక్షేమాన్ని ఈ ప్రభుత్వం పూర్తిగా విస్మరించిందని, రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ప్రగల్భాలు పలుకుతున్న రుణమాఫీ అమలుపై ఆయన ఘాటుగా స్పందించారు. రుణమాఫీ కాక రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, మోసపు మాటలు చెప్పి గద్దెనెక్కిన కాంగ్రెస్ ప్రభుత్వనికి రైతుల గోస తగలక తప్పదన్నారు. కార్యకర్తలను ఉద్దేశించి రాజ్యసభ సభ్యులు వద్దిరాజు రవిచంద్ర, ఎమ్మెల్సీలు తాతా మధుసూదన్ రావు, రవీందర్ రావు, మాజీ ఎమ్మెల్యేలు రేగా కాంతారావు, మెచ్చా నాగేశ్వరరావు, తాటి వెంకటేశ్వర్లు మాట్లాడారు. ఈ కార్యక్రమంలో పలువురు బిఆర్ఎస్ రాష్ట్ర నాయకులు జిల్లా నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## ప్రజాపాలన ప్రగతి ప్రణాళికను నిరంతర ప్రక్రియగా కొనసాగించాలి

(మొదటి పేజీ తరువాయి...)





అధికారి రాహుల్, జిల్లా అటవీ శాఖ అధికారి కృష్ణ గౌడ్, భద్రాచలం సబ్ కలెక్టర్ మృణాల్ శ్రేష్ఠ తో కలసి జిల్లా అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ అంకిత్ జిల్లాలో ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణలో భాగంగా అన్ని శాఖల ద్వారా చేపట్టిన కార్యక్రమాల పురోగతిని పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. ప్రజావాణి, గ్రామసభల ద్వారా అందిన భూ సమస్యలు, ఇతర సమస్యలకు సంబంధించిన మొత్తం 16,549 దరఖాస్తుల్లో 11,309 దరఖాస్తులను పరిష్కరించగా, 5,240 దరఖాస్తులు పరిష్కార దశలో ఉన్నాయని తెలిపారు. ఫైల్ క్లియరెన్స్, పారిశుధ్యం, వైద్య ఆరోగ్య సేవలు, సంక్షేమ కార్యక్రమాలు, ప్రజా సమస్యల పరిష్కారంలో జిల్లాలో గణనీయమైన పురోగతి సాధించినట్లు పేర్కొన్నారు. సంక్షేమ వసతి గృహాల అభివృద్ధి, విద్యార్థులకు మెరుగైన సౌకర్యాల కల్పన, ఆరోగ్య శిబిరాలు, ఆరోగ్య అవగాహన కార్యక్రమాలను విస్తృతంగా నిర్వహించినట్లు తెలిపారు. గృహనిర్మాణ కార్యక్రమంలో భాగంగా 4,727 గృహప్రవేశాలు నిర్వహించగా, ఇందిరమ్మ గృహాల కోసం రూ.385.55 కోట్లను లబ్ధిదారుల ఖాతాల్లో జమ చేసినట్లు తెలిపారు. జిల్లా వ్యాప్తంగా 2,095 డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లను కేటాయించడంతో పాటు 2,036 కొత్త రేషన్ కార్డులను మంజూరు చేసినట్లు తెలిపారు . వ్యవసాయ రంగంలో 21,952 మంది రైతులకు సన్నబియ్యానికి బోనస్‌గా రూ.67.81 కోట్లు చెల్లించినట్లు తెలిపారు. 40,742.480 మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేసి 5,249 మంది రైతులకు రూ.96.63 కోట్లు చెల్లించినట్లు చెప్పారు. రాష్ట్రంలోనే ధాన్యం కొనుగోలు ప్రక్రియను మొదటగా పూర్తి చేసిన జిల్లాగా భద్రాద్రి కొత్తగూడెం నిలిచిందన్నారు. రైతు భరోసా పథకం కింద 2,07,391 మంది రైతుల ఖాతాల్లో రూ.1,044.40 కోట్లు జమ చేయగా, రైతు బీమా ద్వారా 1,924 మంది రైతు కుటుంబాలకు రూ.96.20 కోట్లు అందించినట్లు తెలిపారు. రుణమాఫీ కింద 55,234 మంది రైతులకు రూ.386.15 కోట్లు చెల్లించినట్లు వెల్లడించారు. విద్యుత్ శాఖ ద్వారా గండుగులపల్లి గ్రామాన్ని మోడల్ సౌరశక్తి గ్రామంగా అభివృద్ధి చేసినట్లు కలెక్టర్ వివరించారు. విద్యుత్ మౌలిక వసతుల అభివృద్ధికి జిల్లాలో పలు కార్యక్రమాలు చేపట్టినట్లు తెలిపారు. ఈ సందర్భంగా జిల్లా అటవీ శాఖ అధికారి కృష్ణ గౌడ్ ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణలో భాగంగా అటవీ శాఖ చేపట్టిన కార్యక్రమాలను వివరించారు. జిల్లాలో విస్తృత స్థాయిలో ప్లాంటేషన్ కార్యక్రమాలు నిర్వహించడంతో పాటు పర్యావరణ పరిరక్షణపై ప్రజలకు అవగాహన కల్పించినట్లు తెలిపారు. వెదురు సాగును ప్రోత్సహించేందుకు ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించామని చెప్పారు. పోడు వ్యవసాయం కోసం అడవుల నరికివేతను నివారించేందుకు గుత్తికోయ గిరిజనులకు అవగాహన సదస్సులు నిర్వహించి అటవీ సంపద పరిరక్షణపై చైతన్యం కల్పించినట్లు వివరించారు. ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి రాహుల్ మాట్లాడుతూ గిరిజనులు, పీవీటీజీ కుటుంబాల సంక్షేమం, జీవనోపాధి అభివృద్ధి, విద్య, వైద్యం, తాగునీరు, మౌలిక సదుపాయాల కల్పనకు చేపట్టిన చర్యలను వివరించారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలను గిరిజనులకు చేరవేసేందుకు ప్రత్యేక కార్యాచరణతో ముందుకు సాగినట్లు తెలిపారు. గిరిజన ప్రాంతాల్లో ప్రజల జీవన ప్రమాణాల మెరుగుదలకు ఐటీడీఏ నిరంతరం కృషి చేస్తోందన్నారు. అనంతరం భద్రాచలం సబ్ కలెక్టర్ మృణాల్ శ్రేష్ఠ మాట్లాడుతూ గోదావరి నది తీర పునరుద్ధరణ కార్యక్రమం ద్వారా సాధించిన ఫలితాలను ప్రత్యేక అధికారికి వివరించారు. దశాబ్దకాలంగా చెత్త డంపింగ్ కేంద్రంగా మారిన గోదావరి నది తీర ప్రాంతాన్ని సమగ్ర కార్యాచరణతో శుభ్రపరిచి పునరుద్ధరించిన విధానాన్ని వివరించారు. ప్రజల భాగస్వామ్యంతో ప్లాస్టిక్ వ్యర్థాల తొలగింపు, ఐదు ఎకరాల భూమిని తిరిగి వినియోగంలోకి తీసుకురావడం, 10 వేల యూకలిప్టస్ మొక్కలు నాటడం వంటి కార్యక్రమాలను విజయవంతంగా చేపట్టినట్లు తెలిపారు. అక్టోబర్ 2025 నుంచి ఫిబ్రవరి 2026 వరకు ఐటీడీఏ, గ్రామపంచాయతీ అధికారులు, స్థానిక ప్రజల సహకారంతో ఈ కార్యక్రమాన్ని అమలు చేసి విశేష ఫలితాలు సాధించినట్లు తెలిపారు . జిల్లా ప్రత్యేక అధికారి శ్రీధర్ మాట్లాడుతూ ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణను విజయవంతంగా అమలు చేసిన జిల్లా యంత్రాంగాన్ని అభినందించారు. ఈ కార్యక్రమం ద్వారా అన్ని శాఖలు ప్రణాళికాబద్ధంగా పనిచేసి ప్రజలకు మెరుగైన సేవలు అందించడంలో మంచి ఫలితాలు సాధించాయని అన్నారు. ప్రభుత్వం మిషన్ మోడ్‌లో చేపట్టిన ఈ కార్యక్రమాన్ని 99 రోజులకే పరిమితం చేయకుండా నిరంతర ప్రక్రియగా కొనసాగించాలని సూచించారు. ప్రజావాణి, గ్రామసభల ద్వారా వచ్చిన దరఖాస్తుల పరిష్కారానికి ప్రత్యేక ప్రాధాన్యత ఇవ్వాలని, ప్రజా సమస్యల పరిష్కారంలో మరింత వేగం పెంచాలని అన్నారు. ప్రతి శాఖ తమ లక్ష్యాలను నిర్దేశించుకుని కార్యాచరణ ప్రణాళికలు రూపొందించి అమలు చేయాలని సూచించారు. సమస్యల పరిష్కారంలో ఎదురైన సవాళ్లు, వాటిని అధిగమించేందుకు తీసుకున్న చర్యలను నమోదు చేసి ఉత్తమ విధానాలుగా అభివృద్ధి చేయాలని చెప్పారు. పారిశుధ్య కార్యక్రమాలు, కార్యాలయాల పరిశుభ్రత, పాత ఫైళ్ల పరిష్కారం, ప్రభుత్వ పథకాల అమలు వంటి కార్యక్రమాలను నిరంతరం కొనసాగించాలని సూచించారు. ప్రతి శాఖ ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక కింద చేపట్టిన కార్యక్రమాలపై ప్రత్యేక డాక్యుమెంటేషన్ రూపొందించాలని ఆదేశించారు. కార్యక్రమాల అమలుకు ముందు, తరువాత పరిస్థితులను స్పష్టంగా చూపించే విధంగా ఫోటోలతో కూడిన "బిఫోర్ అండ్ ఆఫ్టర్" నివేదికలను సిద్ధం చేయాలని సూచించారు. శాఖలు సాధించిన విజయాలు, అమలు చేసిన వినూత్న కార్యక్రమాలు, ఎదుర్కొన్న సవాళ్లు, వాటిని అధిగమించేందుకు తీసుకున్న చర్యలు, ప్రజలకు కలిగిన ప్రయోజనాలను పొందుపరుస్తూ సమగ్ర నివేదికలు తయారు చేసి అందించాలని తెలిపారు. ఈ నివేదికలు ఇతర జిల్లాలు, శాఖలకు ఆదర్శంగా నిలవడంతో పాటు ప్రభుత్వ కార్యక్రమాల ప్రభావాన్ని అంచనా వేయడానికి ఉపయోగపడతాయని పేర్కొన్నారు. ప్రజాపాలన ప్రగతి ప్రణాళికలో "ప్రగతి" అంటే అభివృద్ధి, "ప్రణాళిక" అంటే కార్యాచరణ అని పేర్కొంటూ, అభివృద్ధిని సాధించేందుకు ప్రణాళికాబద్ధమైన పని విధానం అవసరమని తెలిపారు. ప్రతి అధికారి బాధ్యతాయుతంగా పనిచేస్తూ ప్రజలకు మరింత చేరువ కావాలని, జిల్లా అభివృద్ధికి సమిష్టిగా కృషి చేయాలని ప్రత్యేక అధికారి శ్రీధర్ సూచించారు. ఈ సమావేశంలో స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ రవీంద్రనాథ్, డిఆర్ఓ పద్మావతి, కొత్తగూడెం ఆర్డీవో మధు, తాసిల్దార్లు, అన్ని శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

## భద్రాద్రి ఆకాశయానానికి మార్గం సుగమం

(మొదటి పేజీ తరువాయి...)

10 రోజుల్లో ఫీజిబిలిటీ నివేదిక సమర్పించాలని ఆదేశించారు. అవసరమైన ప్రక్రియలను అత్యవసర ప్రాతిపదికన పూర్తి చేయాలని సూచించారు.భద్రాచలం శ్రీ సీతారామ చంద్రస్వామి దేవస్థానానికి ప్రతి సంవత్సరం లక్షలాది మంది భక్తులు తరలివస్తున్న నేపథ్యంలో విమానాశ్రయం నిర్మాణం జరిగితే దేశ విదేశాల నుంచి వచ్చే భక్తులకు ప్రయాణం మరింత సులభం కానుంది. అలాగే సింగరేణి, హెవీ వాటర్ ప్లాంట్, ఐటీసీ వంటి పారిశ్రామిక సంస్థలు, అటవీ సంపద, పర్యాటక అవకాశాలకు ఈ ఎయిర్‌పోర్టు కొత్త ఊపిరి పోస్తుందని మంత్రులు అభిప్రాయపడ్డారు.భూసేకరణ, మౌలిక వసతులు, అనుమతుల విషయంలో రాష్ట్ర ప్రభుత్వం పూర్తి సహకారం అందిస్తుందని పేర్కొంటూ, భద్రాద్రి ఎయిర్‌పోర్టు కల త్వరలోనే నిజం కావాలనే ఆశాభావాన్ని వ్యక్తం చేశారు.

## అరుదైన బోరాకు భారీ డిమాండ్

**చర్ల, జూన్ 23: (ప్రజా జ్యోతి ):** ఛత్తీస్‌గఢ్ రాష్ట్రంలోని బస్తర్ అడవుల్లో లభించే అరుదైన 'బోరా' పుట్టగొడుగులు ప్రస్తుతం భారీ ధర పలుకుతున్నాయి. తొలకరి వర్షాలు కురిసిన అనంతరం సహజసిద్ధంగా పెరిగే ఈ ప్రత్యేక శిలీంధ్రం మార్కెట్‌లో కిలో రూ.3 వేల వరకు విక్రయించబడుతోంది. పరిమిత లభ్యత, ప్రత్యేక రుచి కారణంగా బోరాకు ప్రతి ఏడాది భారీ డిమాండ్ ఏర్పడుతోంది. బస్తర్ ప్రాంతం దట్టమైన అడవులు, గిరిజన సంస్కృతి, అటవీ సంపదకు ప్రసిద్ధి చెందింది. ఈ ప్రాంతంలోని సాల్ చెట్ల వేర్ల చుట్టూ సహజంగా పెరిగే బోరా అక్కడి ప్రజలకు ఎంతో ప్రత్యేకమైన ఆహార పదార్థంగా గుర్తింపు పొందింది. తొలి వర్షాల తర్వాత మాత్రమే లభించే ఈ పుట్టగొడుగులను కృత్రిమంగా సాగు చేయడం సాధ్యం కాదు. పూర్తిగా ప్రకృతి అనుకూల పరిస్థితుల్లో మాత్రమే ఇవి పెరుగుతాయి.ప్రస్తుతం జగదల్పూర్ మార్కెట్‌తో పాటు బస్తర్ పరిసర ప్రాంతాల్లో బోరా విక్రయాలు ప్రారంభమయ్యాయి. రుచి, పోషక విలువలు, అరుదైన లభ్యత కారణంగా స్థానికులతో పాటు ఇతర ప్రాంతాల ప్రజలు కూడా వీటిని కొనుగోలు చేసేందుకు ఆసక్తి చూపుతున్నారు. దీంతో మార్కెట్‌లో ధరలు గణనీయంగా పెరిగాయి.బోరా సేకరణ గిరిజన కుటుంబాలకు అదనపు ఆదాయ వనరుగా మారింది. గ్రామీణ గిరిజనులు తెల్లవారుజామునే అడవులకు వెళ్లి బోరాను సేకరించి మార్కెట్‌లో విక్రయిస్తుంటారు. మంచి ధర లభించడం వల్ల వారికి ఆర్థికంగా కొంత ఊరట కలుగుతోంది.స్థానిక వంటకాల్లో బోరాకు ప్రత్యేక స్థానం ఉంది. దాని ప్రత్యేక రుచి కారణంగా ప్రజలు ఏడాది పొడవునా బోరా సీజన్ కోసం ఎదురుచూస్తుంటారు. ఆంధ్రప్రదేశ్‌లో పులస చేపకు ఎంత ఆదరణ ఉంటుందో బస్తర్ ప్రాంతంలో బోరాకు కూడా అంతే స్థాయిలో డిమాండ్ ఉందని స్థానికులు చెబుతున్నారు. బోరా కేవలం ఆహార పదార్థమే కాకుండా బస్తర్ జీవ వైవిధ్యం అటవీ సంపదకు ప్రతీకగా నిలుస్తోంది అని పలువురు అభిప్రాయపడుతున్నారు.

# ఆమ్ బజార్‌పై అధికారుల వైఖరి ఏంటో..?

- ఏళ్ల తరబడి డ్రైనేజీలపైనే వ్యాపారాలు, నిర్మాణాలు
- నోటీసులు ఇచ్చి చేతులు దులుపుకుంటున్నారా..?
- అధికారులు మారినా.. వ్యాపారుల పంథా మాత్రం మారడం లేదా..?
- పలుమార్లు నోటీసులు జారీ చేసినా ఫలితం శూన్యమేనా..?
- అధికారుల వద్ద యాక్షన్ ప్లాన్ ఉందా లేదా..?
- రాజకీయ ఒత్తిళ్లతో చర్యలు నిలిచిపోయాయా..?
- కావాలనే కాలయాపన చేస్తున్నారా..?
- ఉన్నతాధికారులకు తప్పుడు నివేదికలు వెళ్తున్నాయా..?
- అధికారుల మౌనం వెనుక మర్మమేమిటో..?
- ఆమ్ బజార్ వ్యవహారంపై సర్వత్రా విమర్శలు
- పూర్తి స్థాయిలో ప్రక్షాళన చేయాలని ప్రజల డిమాండ్





**ఇల్లందు, జూన్ 23 (ప్రజా జ్యోతి)** ఇల్లందు పట్టణంలో వాణిజ్య కార్యకలాపాలకు కేంద్ర బిందువుగా ఉన్న ఆమ్ బజార్ ప్రాంతం ప్రస్తుతం అక్రమ ఆక్రమణలు, డ్రైనేజీలపై నిర్మాణాలు, నిబంధనలకు విరుద్ధంగా సాగుతున్న వ్యాపారాలతో ప్రజల ఆందోళనకు కారణమవుతుంది. ఏళ్ల తరబడి కొనసాగుతున్న ఈ సమస్యపై పలుమార్లు ఫిర్యాదులు, వినతిపత్రాలు, అధికారుల తనిఖీలు, నోటీసులు జరిగినప్పటికీ పరిస్థితిలో మాత్రం పెద్దగా మార్పు కనిపించకపోవడం విమర్శలకు తావిస్తుంది. ముఖ్యంగా డ్రైనేజీలపై శాశ్వత, తాత్కాలిక నిర్మాణాలు పెరిగిపోవడంతో మురుగునీటి ప్రవాహం అడ్డంకులకు గురవుతుండగా, వర్షాకాలంలో పరిస్థితి మరింత దయనీయంగా మారుతుందని స్థానికులు వాపోతున్నారు.

### ››› డ్రైనేజీలు మాయమైపోతున్నాయా..?

ఆమ్ బజార్ పరిసర ప్రాంతాల్లో పలు చోట్ల డ్రైనేజీలపై షెడ్లు, మెట్లు, గోడలు, దుకాణాల విస్తరణలు నిర్మించబడినట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. కొన్నిచోట్ల డ్రైనేజీలు పూర్తిగా కనిపించకుండా పోయే స్థాయిలో ఆక్రమణలు జరిగాయని స్థానికులు చెబుతున్నారు. దీనివల్ల మురుగునీటి పారుదల వ్యవస్థ దెబ్బతిని దుర్వాసనలు, దోమల బెడద, నీటి నిల్వ వంటి సమస్యలు తలెత్తుతున్నాయని పేర్కొంటున్నారు.

### ››› నోటీసులు జారీ... చర్యలు ఎక్కడ..?

సంబంధిత మున్సిపల్ శాఖ అధికారులు పలుమార్లు ఆక్రమణదారులకు నోటీసులు జారీ చేసినట్లు చెబుతున్నప్పటికీ, వాటి అమలు విషయంలో మాత్రం పురోగతి కనిపించడం లేదనే విమర్శలు వినిపిస్తున్నాయి. నోటీసులు ఇచ్చిన తర్వాత అక్రమ నిర్మాణాలను తొలగించారా? లేక కేవలం హెచ్చరికలకే పరిమితమయ్యారా? అనే ప్రశ్నలు తలెత్తుతున్నాయి. నోటీసులు జారీ చేయడం ద్వారా బాధ్యత ముగిసినట్లుగా వ్యవహరిస్తున్నారనే అభిప్రాయం ప్రజల్లో వ్యక్తమవుతుంది.

### ››› అధికారులు మారినా పరిస్థితి మారదా..?

గత కొన్నేళ్లలో మున్సిపల్ శాఖలో పలువురు అధికారులు మారినా ఆమ్ బజార్ సమస్య మాత్రం యథాతథంగా కొనసాగుతుంది. ప్రతి అధికారి బాధ్యతలు స్వీకరించినప్పుడు సమస్యను పరిష్కరిస్తామని హామీలు ఇచ్చినా, క్షేత్ర స్థాయిలో మాత్రం ఫలితాలు కనిపించకపోవడం ఆశ్చర్యానికి గురిచేస్తుంది. అధికారులు మారుతున్నా వ్యవస్థ తీరు మాత్రం మారడం లేదనే విమర్శలు బలంగా వినిపిస్తున్నాయి.

### ››› రాజకీయ ఒత్తిళ్లు అడ్డంకిగా మారాయా..?

ఆమ్ బజార్ ఆక్రమణలతో పాటు డ్రైనేజీలపై వ్యాపారం చేస్తున్నప్పటికి కఠిన చర్యలు తీసుకోవాల్సిన అధికారులు ఎందుకు వెనుకంజ వేస్తున్నారనే అంశం ప్రస్తుతం చర్చనీయాంశంగా మారింది. కొందరు వ్యాపారులు రాజకీయ నాయకుల అండదండలతోనే నిబంధనలను ఉల్లంఘిస్తూ వ్యాపారాలు కొనసాగిస్తున్నారనే ప్రచారం జరుగుతుంది. ఈ నేపథ్యంలో రాజకీయ ఒత్తిళ్లు అధికారుల చేతులను కట్టేస్తున్నాయా అనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

### ››› ఉన్నతాధికారులకు అసలు వాస్తవాలు చేరుతున్నాయా..?

స్థానికంగా సమస్యలు కొనసాగుతున్నప్పటికీ, ఉన్నతాధికారులకు మాత్రం తప్పుడు నివేదికలు వెళ్తున్నాయనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. క్షేత్ర స్థాయిలో వాస్తవ పరిస్థితులను పరిశీలిస్తేనే అసలు నిజాలు బయటపడుతాయని ప్రజలు అంటున్నారు. ఒకవేళ తప్పుడు నివేదికలు పంపుతున్నట్లయితే బాధ్యులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు.

### ››› కాలయాపన వెనుక కారణాలేమిటి..?

ఆమ్ బజార్ డ్రైనేజీలపై వ్యాపారాలు, నిర్మాణాల సమస్య అందరికీ తెలిసినప్పటికి పరిష్కారం మాత్రం కనిపించకపోవడంతో కావాలనే కాలయాపన జరుగుతోందా అనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. నోటీసులు ఇచ్చి చేతులు దులుపుకుంటూ అసలు చర్యలను వాయిదా వేస్తున్నారనే ఆరోపణలున్నాయి. ప్రజా సమస్యలపై ఇలాంటి నిర్లక్ష్య ధోరణి సమంజసం కాదని సామాజిక వర్గాలు అభిప్రాయపడుతున్నాయి.

### ››› వ్యాపారుల వైఖరి ఏమిటో..?

ఆమ్ బజార్ వ్యవహారంలో వ్యాపారులు తమ వ్యాపార అవసరాల దృష్ట్యా సంవత్సరాలుగా ఉన్న నిర్మాణాలనే కొనసాగిస్తున్నామని, అందరికీ ఒకే విధంగా నిబంధనలు అమలు చేస్తే అభ్యంతరం లేదని చెబుతున్నట్లు సమాచారం. ఎంపిక చేసిన కొందరిపైనే చర్యలు తీసుకుంటే అది వివాదాలకు దారి తీసే అవకాశముందని వారు అభిప్రాయపడుతున్నారని తెలుస్తుంది. ముఖ్యంగా ఆమ్ బజార్‌లో ఉన్న అన్ని ఆక్రమణలను గుర్తించి, డ్రైనేజీలను పూర్తిస్థాయిలో ప్రక్షాళన చేయాలని, అక్రమ నిర్మాణాలపై ఎలాంటి రాజకీయ, ఆర్థిక, సామాజిక ఒత్తిళ్లకు లొంగకుండా చర్యలు తీసుకోవాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు. ప్రత్యేక బృందాలతో సమగ్ర సర్వే నిర్వహించి, డ్రైనేజీల అసలు పరిమాణాలను పునరుద్ధరించాలని కోరుతున్నారు. సమస్య మరింత జఠిలంగా మారకముందే అధికారులు స్పష్టమైన కార్యాచరణ ప్రణాళికతో ముందుకు రావాల్సిన అవసరం ఉందని ప్రజలు అభిప్రాయపడుతున్నారు.

### ››› చర్యలు తీసుకుంటారా... మరోసారి నోటీసులకే పరిమితమవుతారా..?

ఆమ్ బజార్‌లో కొనసాగుతున్న డ్రైనేజీలపై వ్యాపారం, నిర్మాణాల వ్యవహారంపై అధికారులు ఈసారైనా చర్యలు తీసుకుంటారా? లేక మరోసారి నోటీసులు జారీ చేసి చేతులు దులుపుకుంటారా? అన్న అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. పట్టణ అభివృద్ధి, ప్రజా సౌకర్యాలు, పారిశుధ్య పరిరక్షణ కోసం అయినా సంబంధిత శాఖలు సమన్వయంతో పని చేసి పూర్తి స్థాయి ప్రక్షాళన చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు.

## ప్రభుత్వ బడిలో కూతురిని చేర్పించి ఆదర్శంగా నిలిచిన ఉపాధ్యాయుడు

- అభినందించిన యంఈఓ



**ఇల్లందు, జూన్ 23 (ప్రజా జ్యోతి)** ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికి ఓ ప్రభుత్వ ఉపాధ్యాయుడు ఆదర్శంగా నిలిచారు. యంపిపిఎస్ సుదిమళ్ళ పాఠశాలలో ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్న చీమల సురేందర్ తన కుమార్తె హర్షిని అమూల్యను మంగళవారం స్థానిక జడ్పీఎస్ఎస్ సుభాష్ నగర్ ఉన్నత పాఠశాలలో 6వ తరగతిలో చేర్పించాడు. వృత్తి పట్ల ఎంతో నిబద్ధత కలిగి ప్రభుత్వ విద్యపై నమ్మకంతో సురేందర్ తీసుకున్న ఈ నిర్ణయం పట్ల సర్వత్రా ప్రశంసలు వ్యక్తమవుతున్నాయి. జెడ్పిఎస్ఎస్ సుభాష్ నగర్ పాఠశాల ప్రధానోపాధ్యాయుడు, యంఈఓ ఉమా శంకర్ మాట్లాడుతూ అత్యుత్తమ విద్యా ప్రమాణాలు సబ్జెక్టు నిపుణులైన అనుభవజ్ఞులైన ఉపాధ్యాయ బృందంతో కార్పొరేట్ పాఠశాలలకు ధీటుగా రాణిస్తుందని, తమ పాఠశాలపై నమ్మకంతో తన కుమార్తె ను జెడ్పీఎస్ఎస్ సుభాష్‌నగర్ పాఠశాలలో చేర్పించడం సంతోషకరమన్నారు. సుదిమళ్ళ ఉపాధ్యాయుడు సురేందర్ ను అభినందించారు. ప్రభుత్వ ఉపాధ్యాయుడు సురేందర్ మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్యతో పాటు నిపుణులైన ఉపాధ్యాయులు అందుబాటులో ఉన్నారని, తల్లిదండ్రులంతా ప్రైవేట్ వ్యామోహం వీడి ప్రభుత్వ బడులను సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

## డ్రగ్ రహిత సమాజ నిర్మాణానికి యువత ముందుకు రావాలి

- : ఎస్సై సోమేశ్వర్



**ఆళ్ళపల్లి, జూన్23 (ప్రజా జ్యోతి)** డ్రగ్స్, మత్తు పదార్థాల నిర్మూలనకు యువత కృషి చేయాలని, చెడు వ్యసనాలకు దూరంగా ఉంటూ మంచి మార్గంలో పయనించాలని స్థానిక ఎస్సై సోమేశ్వర్ మంగళవారం మండల కేంద్రంలో యువత కీ సూచించారు. మత్తు పదార్థాలకు బానిస కాకుండా విద్య, క్రీడలు, సామాజిక సేవల వైపు దృష్టి సారించాలని కోరారు. అలాగే వర్షాకాల వ్యవసాయ సీజన్ ప్రారంభమైన నేపథ్యంలో ట్రాక్టర్లను మైనర్లతో నడపించడం, ద్విచక్ర వాహనాలను మైనర్లకు ఇవ్వడం చట్టవిరుద్ధమని హెచ్చరించారు. ఎటువంటి సంఘటనలు జరిగిన తల్లిదండ్రులు, వాహన యజమానులు చట్టపరమైన చర్య ఎదుర్కోవాల్సి వస్తుందని తెలిపారు. ట్రాక్టర్లు, ఇతర వాహనాలను తప్పనిసరిగా డ్రైవింగ్ లైసెన్స్ కలిగిన వ్యక్తులతోనే నడిపించాలని, గ్రామాల్లో రోడ్డు భద్రతా నిబంధనలు పాటించి ప్రమాదాలను నివారించాలని ఎస్సై సోమేశ్వర్ విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమం స్టేషన్ సిబ్బంది గ్రామ ప్రజలు పాల్గొన్నారు

## ఈ బయ్యారం క్రాస్‌రోడ్‌లో వాహనాల తనిఖీలు నిర్వహించిన పోలీసులు



**పినపాక, జూన్ 23 (ప్రజాజ్యోతి)** మండల పరిధిలోని ఈ బయ్యారం క్రాస్‌రోడ్ వద్ద సీఐ వెంకటేశ్వరరావు, ఎస్ఐ సురేష్ ఆధ్వర్యంలో మంగళవారం ప్రత్యేక వాహన తనిఖీలు చేపట్టారు. ఈ సందర్భంగా వాహనాల పత్రాలు, డ్రైవింగ్ లైసెన్సులు, హెల్మెట్ వినియోగం, ట్రాఫిక్ నిబంధనల అమలును పరిశీలించారు. నిబంధనలు ఉల్లంఘించిన వాహనదారులకు అవగాహన కల్పిస్తూ, రోడ్డు భద్రతా నియమాలను తప్పనిసరిగా పాటించాలని సూచించారు. ప్రజల భద్రత దృష్ట్యా ఇటువంటి తనిఖీలు నిరంతరం కొనసాగుతాయని పోలీసులు తెలిపారు. వాహనదారులు అవసరమైన పత్రాలు వెంట ఉంచుకోవడంతో పాటు ట్రాఫిక్ నిబంధనలను పాటించి సురక్షిత ప్రయాణం చేయాలని సూచించారు.

## జిల్లా అటవీ అధికారిని మర్యాదపూర్వకంగా కలిసిన గొడిశాల రామనాథం



**పినపాక, జూన్ 23 (ప్రజాజ్యోతి)** భద్రాద్రి కొత్తగూడెంజిల్లా అటవీ శాఖ అధికారి జి. కృష్ణ ఐ ఎఫ్ ఎస్ ను భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఉపాధ్యక్షులు, పినపాక మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు గొడిశాల రామనాథం పోడు భూముల సమస్యపై కలిసి మాట్లాడారు. ఈ సందర్భంగా జిల్లాలో అటవీ సంరక్షణ, పర్యావరణ పరిరక్షణతో పాటు ప్రజలకు సంబంధించిన పలు అంశాలపై చర్చించినట్లు తెలిపారు. జిల్లా అటవీ అధికారిగా బాధ్యతలు నిర్వహిస్తున్న జి. కృష్ణ కి శుభాకాంక్షలు తెలియజేసి, శాఖ అభివృద్ధికి తమ సహకారం ఎల్లప్పుడూ ఉంటుందని రామనాథం పేర్కొన్నారు.

## గంజాయిని విక్రయిస్తే కఠిన చర్యలు



**ఇల్లందు, జూన్ 23 (ప్రజా జ్యోతి )** గంజాయి విక్రయిస్తే ఎంతటి వారైనా కఠిన చర్యలు తప్పవని ఇల్లందు సీఐ తాటిపాముల సురేష్ హెచ్చరించారు. మంగళవారం ఇల్లందులోని పాన్ షాపులను ఆకస్మికంగా తనిఖీ చేశారు. షాపులలో ఉన్న స్టాకును క్షుణ్ణంగా పరిశీలించారు. ఈ సందర్భంగా సిఐ మాట్లాడుతూ ప్రస్తుత సమాజంలో గంజాయి విపరీతంగా పెరిగిపోయిందని, ఇతర రాష్ట్రాల నుండి గంజాయి సరఫరా అవుతుందని తెలిపారు. సిగరెట్లను గంజాయితో పాటు సేవించడం జరుగుతుందని, మైనర్లకు షాపుల నిర్వాహకులు సిగరెట్లను విక్రయించవద్దని సూచించారు. గంజాయి నిర్మూలనకు ప్రతి ఒక్కరు సహకరించాలని, గంజాయి అక్రమ రవాణా, విక్రయాలు జరుగుతున్నట్లు అనుమానం వస్తే పోలీసులకు సమాచారం ఇవ్వాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐ లు కొత్తపల్లి ఉమ, సారంగపాణి, సిబ్బంది పాల్గొన్నారు.

## మత్తు పదార్థాల నిర్మూలనకు అందరి సహకారం అవసరం

- ఏడుళ్ల బయ్యారం సి ఐ వెంకటేశ్వరావు




**పినపాక, జూన్ 23(ప్రజాజ్యోతి )** ఏడుళ్ల బయ్యారం జివిఆర్ ఫంక్షన్ హాల్‌లో సీఐ ఆధ్వర్యంలో మత్తు పదార్థాల వాడకం నిర్మూలనపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ వెంకటేశ్వరావు మాట్లాడుతూ మత్తు పదార్థాలను వినియోగించడం, రవాణా చేయడం, నిల్వ ఉంచడం లేదా విక్రయించడం వంటి చర్యలు చట్టరీత్యా తీవ్రమైన నేరమని అయన తెలిపారు.మత్తు పదార్థాలకు సంబంధించిన కేసుల్లో ఎన్ డి పీ ఎస్ చట్టం ప్రకారం కఠినమైన శిక్షలు అమలులో ఉన్నాయని పేర్కొన్నారు. డ్రగ్స్, గంజాయి వంటి మత్తు పదార్థాల గురించి ఏదైనా సమాచారం తెలిసిన వెంటనే పోలీసులకు తెలియజేయాలని ప్రజలను కోరారు.ప్రజల సహకారంతోనే మత్తు పదార్థాల నిర్మూలన సాధ్యమవుతుందని, యువత చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలని సూచించారు. సమాజాన్ని మత్తు పదార్థాల రహితంగా తీర్చిదిద్దేందుకు ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించాలని పిలుపునిచ్చారు.ఈ కార్యాక్రమంలో మత్తు పదార్థాల వల్ల కలిగే దుష్పరిణామాలపై అవగాహన కల్పించారు.ఈ కార్యక్రమంలో ఏడుళ్ల బయ్యారం ఎస్సై సురేష్ పోలీసు సిబ్బంది, స్థానిక యువత, ప్రజాప్రతినిధులు మరియు గ్రామస్తులు పాల్గొన్నారు.

## గిరిజన యువతకు ఉచిత ఉపాధిపై శిక్షణ



**భద్రాచలం టౌన్ , జూన్ 23 ప్రజాజ్యోతి** గిరిజన నిరుద్యోగ యువతీ, యువకులకు భద్రాచలం ఐటిడిఏ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న వైటీసీ శిక్షణా కేంద్రంలో 18 నుండి 33 సంవత్సరాల వయస్సు గల ఎస్టీ యువతీ, యువకులకు మాత్రమే ఉచిత శిక్షణ అందించి ఉపాధి అవకాశాలు కల్పించడం జరుగుతుందని ఐటిడిఏ ప్రాజెక్టు అధికారి బి రాహుల్ మంగళవారం నాడు ఒక ప్రకటనలో తెలిపారు. ప్రస్తుతం కంప్యూటర్ కోర్సు – 1 బ్యాచ్, బ్యూటీషియన్ కోర్సు – 2 బ్యాచ్ లు మాత్రమే సీట్లు మిగిలి ఉన్నాయని ఉచిత భోజనం వసతి శిక్షణ అనంతరం సర్టిఫికెట్ ఉపాధి అవకాశాలు కల్పించడం జరుగుతుందని ఆయన అన్నారు. ఆసక్తిగల గిరిజన నిరుద్యోగ యువతీ యువకులు వచ్చేనెల జూలై 06వ తేదీ లోగా తమ లగేజ్ తో నేరుగా శిక్షణా కేంద్రానికి వచ్చి రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని, రిజిస్ట్రేషన్ పూర్తయిన వెంటనే తరగతులు ప్రారంభమవుతాయని తెలిపారు. మరిన్ని వివరాల కొరకు 7993102529 ఫోన్ నెంబర్లను సంప్రదించాలన్నారు.

# అభివృద్ధి విషయంలో చర్చకు సిద్ధమా

- నిత్యం ప్రజల మధ్యలో ఉంటున్న ఎమ్మెల్యే
- మాజీ ఎమ్మెల్యే మాట్లాడే భాష మార్చుకోవాలి



**ఇల్లందు, జూన్ 23 (ప్రజా జ్యోతి )** ఇల్లందు నియోజకవర్గ అభివృద్ధి విషయంలో మాజీ ఎమ్మెల్యే చర్చకు సిద్ధమా అని మాజీ మున్సిపల్ చైర్ పర్సన్ యదళ్లపల్లి అనసూయ, మార్కెట్ కమిటీ చైర్మన్ బానోత్ రాంబాబు, మున్సిపల్ కోఆప్షన్ సభ్యుడు మడుగు సాంబమూర్తి, పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు బోళ్ల సూర్యం లు అన్నారు. మంగళవారం స్థానిక ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ ఎమ్మెల్యే కోరం కనకయ్య నిత్యం ప్రజల మధ్యలో ఉంటూ వారి సమస్యల పరిష్కారం కోసం కృషి చేయడం జరుగుతుందన్నారు. ముఖ్యంగా మాజీ ఎమ్మెల్యే హరిప్రియ నాయక్ మాట్లాడే భాష మార్చుకోవాలని హితవు పలికారు. నియోజకవర్గ అభివృద్ధి విషయంలోనే గతంలో ఎమ్మెల్యే అప్పటి అధికార పార్టీ బిఆర్ఎస్ లో చేరడం జరిగిందని, అభివృద్ధికి ఎలాంటి నిధులు కేటాయించకపోవడంతోనే మరల కాంగ్రెస్ పార్టీలో చేరినట్లు తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం అంటేనే రైతుల పక్షపాతి అని గుర్తు చేశారు. ఎమ్మెల్యే కోరం కనకయ్యకు జనంలో వస్తున్న ఆదరణను చూసి ఓర్వలేకనే బిఆర్ఎస్ మాజీ ఎమ్మెల్యే, పార్టీ శ్రేణులు అసత్య ఆరోపణలు చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇల్లందు బస్ డిపోలో రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌తో చర్చించి సర్వీసులు పెంచడంతో పాటు 400 మంది సిబ్బందిని నియమించినట్లు పేర్కొన్నారు. గతంలో ఎమ్మెల్యేగా ఉన్న హరిప్రియ అభివృద్ధిని చూసే అసెంబ్లీ ఎన్నికల్లో కోరం కనకయ్యకు 57 వేల ఓట్లకు పైగా మెజార్టీ ఇచ్చారని గుర్తు చేశారు. మాజీ ఎమ్మెల్యే ఆ మెజార్టీ జీర్ణించుకోలేకనే మొద్దు నిద్రలో ఉన్నారని ఎద్దేవా చేశారు. 2009లో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలో ఉన్నప్పుడే ఇల్లందు ప్రభుత్వ వైద్యశాలను ముప్పై పడకలుగా మార్చడం జరిగిందని, 100 పడకల వైద్యశాలగా మార్చింది కూడా కాంగ్రెస్ ప్రభుత్వమేనన్నారు. ఇప్పటివరకు ఎమ్మెల్యే కూర కనకయ్య ఎవరిని విమర్శించలేదని తెలిపారు. ప్రస్తుతం మాజీ ఎమ్మెల్యే హరిప్రియ నాయక్ ఎమ్మెల్యేగా ఉన్న సమయంలో సీతారామ ప్రాజెక్టు డిజైన్ మారుస్తుంటే మీరు ఏమి చేశారని, ఆ ప్రాజెక్టు నీటిని పక్క నియోజకవర్గానికి తరలిస్తుంటే అప్పుడు ఎందుకు మాట్లాడలేదని ప్రశ్నించారు ప్రస్తుతం ఎమ్మెల్యే కోరం కనకయ్య మీలాగా మూడు పార్టీలు మారలేదని గుర్తు చేశారు. 1987 నుండి ఎమ్మెల్యే కోరం కనకయ్య రాజకీయ ప్రస్థానం ప్రారంభమైందని, ఎన్నికల్లో గెలిచిన, ఓడిన నిత్యం ప్రజల్లోనే ఉన్నాడన్నారు. రైతులు పండించిన పంటను ప్రతి గింజను కొనుగోలు చేస్తామని చెప్పిన ప్రభుత్వం మాట నిలుపుకుందన్నారు. గత ప్రభుత్వంలో రైతులకు పనిముట్లు ఇచ్చిన దాఖలాలు లేవని, ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వంలో రైతులకు పనిముట్లు ఇవ్వడం జరిగిందని తెలిపారు. గార్ల మండలంలోని రాంపురం బ్రిడ్జి నిర్మాణానికి రూ. 20 కోట్ల కేంద్ర ప్రభుత్వం నిధులు మంజూరు చేయడం జరిగిందని, త్వరలోనే పనులు ప్రారంభమవుతాయని తెలిపారు. అసెంబ్లీలో నియోజకవర్గం గురించి మాట్లాడిన దాఖలాలు లేవని మాజీ ఎమ్మెల్యే అనడం హస్యాస్పదంగా ఉందని, అసెంబ్లీలో ఎమ్మెల్యే కోరం కనకయ్య మాట్లాడిన విషయము నియోజకవర్గ ప్రజలకు తెలుసునని అన్నారు. సింగరేణికి పుట్టినిల్లయిన ఇల్లందు భవిష్యత్తు కనుమరుగు కావద్దనే ఆకాంక్షతో 2017 లో అన్ని రాజకీయ పార్టీలను కలుపుకొని అప్పటి ముఖ్యమంత్రితో చర్చించి ఇల్లందు భవిష్యత్తు పెంచడం జరిగిందన్నారు. ఉపముఖ్యమంత్రి భట్టితో మాట్లాడి ప్రస్తుతం పూసపల్లి ఓసి పనులు ప్రారంభించేందుకు కృషి చేయడం జరుగుతుందని పేర్కొన్నారు. ఇల్లందు పట్టణంలో బంజారా భవన్, అంబేద్కర్ భవన్, మల్టీ యుటిలిటీ సెంటర్ ను తానే తీసుకువచ్చానని చెబుతున్న మాజీ ఎమ్మెల్యే హరి ప్రియ నాయక్ అప్పుడు నిధులు ఉంటే పనులు ఎందుకు పూర్తి కాలేదని ప్రశ్నించారు. ప్రస్తుతం ఎమ్మెల్యే కోరం కనకయ్య బంజారా భవన్, కొమరం భీమ్ భవన్, అంబేద్కర్ భవనాల నిధుల కోసం ఎంతో కృషి చేస్తున్నట్లు తెలిపారు. ఎంఎస్ఎంఈ స్కీమ్ లో లోన్లు ఇప్పిస్తామని ఎంతోమంది నిరుద్యోగులను వారి ఆఫీస్ చుట్టూ తిప్పుకోలేదా అని ఆరోపించారు. ఆర్ అండ్ ఆర్ కాలనీ కోసం సింగరేణి సంస్థ కొంత స్థలాన్ని కేటాయిస్తే దానిని ఆక్రమించుకొని ఫౌండేషన్ కట్టలేదా, అది అవినీతి కబ్జా కాదా అని విమర్శించారు. మాజీ ఎమ్మెల్యే హయాంలో నియోజకవర్గం అభివృద్ధి చెందిందో లేదో కానీ వారు మాత్రం అభివృద్ధి చెందారని ఆరోపించారు. ఎమ్మెల్యే కోరం కనకయ్య ఇప్పటివరకు నియోజకవర్గ అభివృద్ధి కోసం రూ. 517.70 కోట్ల నిధులను తీసుకురావడం జరిగిందని గుర్తు చేశారు. మరో మారు ఎమ్మెల్యే కోరం కనకయ్య పై అనుచిత వ్యాఖ్యలు, నిరాధారమైన ఆరోపణలు చేస్తే సహించేది లేదని హెచ్చరించారు. ఈ సమావేశంలో మున్సిపల్ వైస్ చైర్మన్ పెండేల రాజు, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు మండల రాము, వార్డు కౌన్సిలర్లు అజ్మీరా వంశీ, జాఫర్, ఉల్లింగ విజయలక్ష్మి, చిల్లా విజయభారతి, నీరుడు ఉపేంద్ర, నీలపు రమేష్, గోపగాని రాజు గౌడ్, మెరుగు కార్తీక్ యాదవ్, కో ఆప్షన్ సభ్యులు ఆజామ్, హసీనా, సర్పంచులు పాయం లలిత, పాయం స్వాతి, నాయకులు సుదర్శన్ కోరి, తాటి భిక్షం, గందె సదానందం, కల్తి పద్మ, గాలి పల్లి సరూప, మాజీ ప్రజా ప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## ఇడమయ్యకు అండగా దాతలు



**చర్ల, జూన్ 23(ప్రజా జ్యోతి ):** చర్ల మండలంలోని మారుమూల బక్కచింతల పాడు గ్రామానికి చెందిన వికలాంగుడు ఇడమయ్యకు పలువురు దాతలు చేయూతనందించారు. రెండు కాళ్లు కోల్పోయి, చేతులు కూడా సరిగా పనిచేయని పరిస్థితుల్లో జీవనం సాగిస్తున్న ఇడమయ్య కుటుంబం గురించి తెలిసిన దాతలు స్పందించి ఆర్థిక సహాయాన్ని అందించారు.హైదరాబాద్ కు చెందిన సాఫ్ట్ వేర్ ఉద్యోగి కాముని శివరామకృష్ణ రూ.10 వేలు, హైకోర్టు న్యాయవాది సీహెచ్ సతీష్ కుమార్ రూ.5 వేలు, టీవీ9 రిపోర్టర్ అనిల్ రెడ్డి రూ.5 వేలు, ఎడారి భూపతి రూ.2 వేలు విరాళంగా అందజేశారు. మొత్తం రూ.22 వేల నగదును కాంగ్రెస్ పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు చీమలమర్రి మురళీకృష్ణ మంగళవారం ఇడమయ్య, సుశీల దంపతులకు అందించారు.ఈ సందర్భంగా దాతల సేవాభావాన్ని మురళీకృష్ణ అభినందించారు. అలాగే భద్రాచలానికి చెందిన సామాజిక సేవకుడు బిర్రు సుధాకర్ ఇడమయ్యకు కృత్రిమ కాలు ఏర్పాటు చేసేందుకు ముందుకు వచ్చినట్లు తెలిపారు. ఇడమయ్యకు వికలాంగుల పింఛన్ మంజూరు చేయాలని ఎమ్మెల్యే డాక్టర్ తెల్లం వెంకట్రావు దృష్టికి తీసుకెళ్లినట్లు అన్నారు .ఇడమయ్య కుటుంబానికి దాతలు సహకారం అందించేందుకు ముందుకు వస్తుండటం అభినందనీయమని స్థానికులు అన్నారు.

## డ్రగ్స్ రహిత సమాజమే లక్ష్యం

- చర్ల సీఐ ఏ. రాజువర్మ



**చర్ల, జూన్ 23: (ప్రజా జ్యోతి ):** యువత మత్తు పదార్థాలకు దూరంగా ఉండి ఆరోగ్యకరమైన జీవన విధానాన్ని అలవర్చుకోవాలని చర్ల సీఐ ఏ. రాజువర్మ, సామాజిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డా. ఆర్. జాన్ సూచించారు. డ్రగ్స్ రహిత సమాజ నిర్మాణమే లక్ష్యంగా ప్రతి ఒక్కరూ బాధ్యతతో వ్యవహరించాలని వారు పిలుపునిచ్చారు.మంగళవారం ఈగల్ ఫోర్స్ తెలంగాణ శాఖ పిలుపు మేరకు చర్ల పోలీస్ శాఖ ఆధ్వర్యంలో చర్ల మండల కేంద్రంలోని బస్టాండ్ సెంటర్‌లో అవగాహన ర్యాలీ నిర్వహించారు. ర్యాలీ అనంతరం సీఐ రాజువర్మ, వైద్యాధికారి డా. జాన్ మాట్లాడుతూ మాదకద్రవ్యాల వినియోగం యువత భవిష్యత్తును దెబ్బతీస్తుందని వాటి వల్ల వ్యక్తిగతంగా, కుటుంబపరంగా సమాజపరంగా తీవ్ర నష్టాలు కలుగుతాయని పేర్కొన్నారు.డ్రగ్స్ నిర్మూలనకు ప్రజల సహకారం ఎంతో అవసరమని అనుమానాస్పద కార్యకలాపాలపై వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని సూచించారు.ఈ కార్యక్రమంలో ఎస్ఐలు ఆర్. నర్సిరెడ్డి, పి. కేశవ్, చర్ల గణేష్ ఆటో యూనియన్ అధ్యక్షుడు పామర్రు బాలాజీ, ఆటో యూనియన్ నాయకులు, యువత , ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

# పోలీసుల తనిఖీలు





- బయటపడిన ఫెర్టిలైజర్ వ్యాపారుల మాయా జాలం?
- విత్తన ప్యాకెట్లను స్వాధీనం చేసుకున్న అధికారులు
- నకిలీ విత్తనాలు అమ్మితే కఠిన చర్యలు తప్పవు: ఏడిఏ

**ఇల్లందు, జూన్23,(ప్రజా జ్యోతి )** పట్టణంలోని జగదాంబ సెంటర్ సమీపంలో ఉన్న సింగరేణి ఫెర్టిలైజర్ షాపులో సీఐ తాటిపాముల సురేష్ మంగళవారం ఆకస్మిత తనిఖీలు నిర్వహించారు. సింగరేణి ఫెర్టిలైజర్ యాజమాన్యం అమ్ముతున్న పత్తి విత్తనాల ప్యాకెట్ పైన క్యూఆర్ కోడ్ సంబంధించి అనేక అనుమానాలు తలెత్తడంతో తక్షణమే సిఐ వ్యవసాయ శాఖ ఏడీఏ కు సమాచారం అందించారు. అంతేకాకుండా ఎలాంటి వాటితో ఫెర్టిలైజర్ వ్యాపారుల మాయాజాలం బహిర్గతమైందని తెలుస్తుంది. ప్యాకెట్ల పైన ప్రింటెడ్ క్యూఆర్ కోడ్ లేకుండా స్టిక్కర్లు అతికించడం ఏంటని ఆ షాపు యజమానిని ప్రశ్నించారు. స్కాన్ చేసినప్పుడు కంపెనీకి సంబంధించిన ఎలాంటి వివరాలు చూపించకపోవడంతో విత్తన ప్యాకెట్లను స్వాధీనం చేసుకొని పక్కన పెట్టారు. ఈలోగా వ్యవసాయ శాఖ అధికారులు రంగంలోకి దిగి ఆ విత్తన ప్యాకెట్లకు సంబంధించిన వివరాలన్నీ సేకరించారు. విత్తన ప్యాకెట్లపై స్టిక్కర్లు ఉన్నప్పటికీ నకిలీ విత్తనాలు కాదని అయితే అనుమానాలు ఉన్నందున వాటిని స్వాధీనం చేసుకొని ల్యాబ్ కి పంపించనున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా ఏడీఏ లాల్ సింగ్ మాట్లాడుతూ నకిలీ విత్తనాలు, నకిలీ పురుగు మందులు విక్రయిస్తే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని, లైసెన్సు రద్దుచేసి క్రిమినల్ కేసులు పెడతామని హెచ్చరించారు. ప్రతి ఫెర్టిలైజర్ దుకాణాన్ని క్షుణ్ణంగా తనిఖీ చేసి ఏ విత్తనాలు, ఎరువులు, పురుగుల మందులు అమ్ముతున్నారో వివరాలు సేకరిస్తామని తెలిపారు. అనుమానం ఉన్న విత్తనాలను ల్యాబ్ కు పంపితే 30 రోజుల వరకు రిపోర్టు వస్తుందని చెప్పగా, అక్కడే ఉన్న కొందరు రైతులు అప్పటివరకు తాము వ్యవసాయం చేసుకోవద్దా అని వ్యవసాయ శాఖ అధికారిని ప్రశ్నించారు. తాము ఇప్పటికే అనుమానం ఉన్న విత్తనాలతో వ్యవసాయ పనులు ప్రారంభించామని, వాటి వల్ల నష్టం వస్తే ఎవరు బాధ్యత వహిస్తారని, ఇష్టానుసారంగా వ్యాపారులు విత్తనాలను తీసుకువచ్చి రైతులకు అంటగట్టి వారిని ఇబ్బందులకు గురి చేయవద్దని, వ్యవసాయ శాఖ అధికారులు విత్తనాలు, ఎరువులు, పురుగుల మందులపై రైతులకు అవగాహన కల్పించి వారిని చైతన్య పరచాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐ లు కొత్తపల్లి ఉమ, సారంగపాణి, ఏఓ సతీష్ కుమార్, పోలీస్, వ్యవసాయ శాఖ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

## ఉపాధి హామీ పథకాన్ని బలోపేతం చేయాలి



**కొత్తగూడెం, జూన్ 23 ( ప్రజాజ్యోతి )** గ్రామీణ ఉపాధి హామీ పథకంలో అమలు చేస్తున్న విబిజీ రాంజీ విధానాన్ని వెంటనే రద్దు చేసిఎన్ఆర్ఈజీఎస్‌ను పునరుద్ధరించాలని తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం (బికెఎంయు) జిల్లా నాయకులు డిమాండ్ చేశారు. మంగళవారం భద్రాద్రి కొత్తగూడెం జిల్లా సమితి ఆధ్వర్యంలో జిల్లా కలెక్టర్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించి, అనంతరం అధికారులకు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా బికెఎంయు జిల్లా ప్రధాన కార్యదర్శి రేసు ఎల్లయ్య, జిల్లా అధ్యక్షుడు వి. పూర్ణచందర్‌రావు మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఉపాధి హామీ పథకాన్ని నిర్వీర్యం చేసే చర్యలను విరమించుకోవాలని కోరారు. ఎన్ఆర్ఈజీఎస్ పథకాన్ని పటిష్టంగా అమలు చేసి, ప్రస్తుతం ఉన్న 100 రోజుల పనిని 200 రోజులకు పెంచాలని డిమాండ్ చేశారు. అలాగే దినసరి కూలీని రూ.700లకు పెంచి చెల్లించాలని కోరారు. పని ప్రదేశాల్లో కార్మికులకు తాగునీరు, నీడ వంటి మౌలిక వసతులు కల్పించాలని పనిలో అంగవైకల్యం పొందిన లేదా మరణించిన కార్మికుల కుటుంబాలకు రూ.10 లక్షల ఎక్స్‌గ్రేషియా చెల్లించాలని ప్రభుత్వాన్ని కోరారు. ఈ కార్యక్రమంలో ఎస్డీ సలీం, ముత్యాల విశ్వనాథం, సప్క నాగేశ్వరరావు, కొమరం హనుమంతరావు, వేములపల్లి శ్రీను, పద్మజ, నిమ్మల రాంబాబు, అన్నారపు వెంకటేశ్వర్లు, గుర్రం వెంకటేశ్వర్లు, అజ్మీర శ్రీనివాస్, వాడే లక్ష్మి , బానోత్ రవి, భూక్య బిక్కులాల్, వజ్జా రాజేశ్వరి, శనగరపు శ్రీనివాసరావు, దినేష్, నామ పండు, గిరి తదితరులు పాల్గొన్నారు.

## నిరువులు, విత్తనాల దుకాణాలపై పోలీసు, అధికారుల ఆకస్మిక తనిఖీలు






**గుండాల జూన్ 23 ప్రజా జ్యోతి** నకిలీ విత్తనాలు, పురుగుమందుల విక్రయాలను కట్టడి చేసేందుకు పోలీసు, వ్యవసాయ శాఖ అధికారులు నిర్వహించారు మంగళవారం మండలంలోని వివిధ ఎరువులు, విత్తనాల దుకాణాలపై తనిఖీ నిర్వహించి, రికార్డులను తనిఖీ చేశారు. నాణ్యమైన ఎరువులు విత్తనాలు రైతులకు అందేలా చూడడం కోసం జిల్లా అధికారుల ఆదేశాల మేరకు ఫెర్టిలైజర్స్ అండ్ పెట్సైడ్స్ షాపులపై తనిఖీలు నిర్వహించామని, సీఐ తిరుపతి, ఎస్సై శ్రావణ్ కుమార్, వ్యవసాయ శాఖ ఈవో వెంకటరమణ తెలిపారు. విక్రయాల రికార్డులు, స్టాక్ వివరాలు, లైసెన్సులు, బిల్లుల నిర్వహణ, నిలువల నిర్వహణ క్షుణ్ణంగా పరిశీలించామన్నారు. రైతులకు విక్రయిస్తున్న విత్తనాలు, ఎరువులు ప్రభుత్వ నిబంధనలకు అనుగుణంగా ఉన్నాయా లేవా అన్న విషయాలను క్షుణ్ణంగా పరిశీలించమన్నారు. ప్యాకెట్ పై తేదీలు, కంపెనీల గుర్తింపు తదితర విషయాలను పరిశీలించామన్నారు. రైతులను మోసం చేసే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. నకిలీ విత్తనాలు, పురుగుమందులు నాసిరకమైన ఎరువులు అమ్మినట్లయితే సంబంధిత దుకాణాల యజమానులపై కఠిన చర్యలు తీసుకుంటామని అవసరమైతే కేసులు నమోదు చేసి, పీడీ యాక్ట్ కింద చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. రైతులు వ్యవసాయ సీజన్ ప్రారంభంలో విత్తనాలు, ఎరువులు కొనుగోలు చేసే సమయంలో బిల్లులు తప్పనిసరిగా తీసుకోవాలని సూచించారు బిల్లులు లేకుండా కొనుగోలు చేసినట్లయితే భవిష్యత్తులో సమస్యలు ఉత్పన్నమైతే, చర్యలు తీసుకోవడం కష్టమవుతుందని అన్నారు. అనుమానస్పదంగా ఎరువులు విత్తనాలు కనిపిస్తే వెంటనే వ్యవసాయ శాఖ లేదా పోలీస్ శాఖకు తెలియజేయాలన్నారు.

## భక్తులకు తప్పని తంటాలు

- విస్టా కాంప్లెక్స్ , చాకలి బజార్ వీధిలోని పారిశుధ్యం అస్తవ్యస్తం
- ఒకటో వార్డు పై ప్రత్యేక దృష్టి సారించాలని గ్రామపంచాయతీ వారికి ప్రత్యేక విజ్ఞప్తి



**భద్రాచలం టౌన్ జూన్ 23 ప్రజాజ్యోతి** నిరంతరం భక్తుల తాకిడితో రద్దీగా ఉండే విస్తా కాంప్లెక్స్ పక్కన ఉన్న చాకలి బజార్ పారిశుధ్యానికి ఆమడ దూరం గా ఉందనిని స్థానికులతో పాటు భక్తులు ఆవేదన వ్యక్తం చేసుకున్నారు. దక్షిణ అయోధ్య భద్రాచలం శ్రీ సీతారామచంద్ర స్వామి వారి దర్శనానికి గోదావరి స్నానాలకి వెళ్లడానికి కీలక మార్గం కావడంతో భక్తులు అధిక సంఖ్యలో ఆ మార్గం గుండా సంచరిస్తూ ఉంటారు. ఆ లైన్ లో ఉన్న కొన్ని లాడ్జిలు, వసతిగృహాల వ్యర్థాలను కాలువలోకి మళ్లించడంతో ఆ మార్గం గుండా వెళ్లాలంటే దుర్వాసన వెదజల్లుతోందని భక్తులు తెలుపుతున్నారు. అంతేకాకుండా ఆ వీధి అంతా పారిశుద్యానికి ఆమడ దూరంలో దర్శనమిస్తుంది. సీసీ రోడ్డు సైతం శిధిలావస్థంగా తయారయింది. గ్రామపంచాయతీ వారు ఇప్పటికైనా ఈ మార్గాన్ని స్వచ్ఛ మార్గంగా తీర్చిదిద్దాలని, కాలువతోపాటు సీసీ రోడ్డుకు మరమ్మత్తులు జరిపించాలని భక్తులు కోరుకుంటున్నారు.

## భద్రాచలం మొబైల్ కోర్టును పునరుద్ధరించాలి

- భద్రాచలం బార్ అసోసియేషన్ డిమాండ్

**భద్రాచలం టౌన్ , జూన్ 22 ప్రజాజ్యోతి** భద్రాచలంలోని మొబైల్ కోర్టును రద్దు చేస్తూ ప్రభుత్వం జారీ చేసిన జీవో 70ని వెంటనే ఉపసంహరించుకోవాలని భద్రాచలం బార్ అసోసియేషన్ డిమాండ్ చేసింది. ఈ మేరకు భద్రాచలం స్థానిక ఎమ్మెల్యే తెల్లం వెంకట్రావుకి బార్ అసోసియేషన్ సభ్యులు మంగళవారం వినతి పత్రం సమర్పించారు. అలాగే ఈ సమస్యను పరిష్కరించాలని కోరుతూ ముఖ్యమంత్రి, రెవెన్యూ శాఖ మంత్రికి విన్నవించాలని నిర్ణయించారు. దీనితో పాటు, 2019 తర్వాత నమోదైన న్యాయవాదులందరికి ప్రభుత్వం హెల్త్ కార్డులను అందజేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో భద్రాచలం బార్ అసోసియేషన్ అధ్యక్షులు కొడాలి శ్రీనివాసన్, ప్రధాన కార్యదర్శి పూసాల శ్రీనివాసాచారి, సంయుక్త కార్యదర్శి తాత లలిత, మాజీ అధ్యక్షులు కోట దేవదానం, సీనియర్ న్యాయవాదులు గోడపర్తి నాగరాజు, రావి రామ్మోహన్, అవులూరి సత్యనారాయణ పాల్గొన్నారు.

## మొబైల్ యాప్‌తో సంబంధం లేకుండా ఎరువుల పంపిణీ చేయాలి

- 29న తహసిల్దార్ కార్యాలయం ముందు ధర్నాను జయప్రదం చేయాలని పిలుపు
- సిపిఐ(ఎంఎల్) న్యూ డెమోక్రసీ



**టేకులపల్లి, జూన్ 23,ప్రజాజ్యోతి:** రైతులకు మొబైల్ యాప్‌తో సంబంధం లేకుండా యూరియా సహా ఇతర ఎరువులను సరిపడా అందించాలని, పెంచిన ఎరువుల ధరలను తగ్గించాలని సిపిఐ(ఎంఎల్) న్యూ డెమోక్రసీ మండల కార్యదర్శి ఎట్టి నరసింహారావు డిమాండ్ చేశారు. ఈ నెల 29న తహసిల్దార్ కార్యాలయం ముందు అఖిల భారత రైతుకూలీ సంఘం మండల కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించనున్న ధర్నాను రైతులు అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని ఆయన పిలుపునిచ్చారు.మంగళవారం టేకులపల్లిలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ వ్యవసాయ సీజన్ ప్రారంభమైనప్పటికీ రైతులకు అవసరమైన ఎరువులు సకాలంలో అందడం లేదని ఆందోళన వ్యక్తం చేశారు.మొబైల్ యాప్ నిబంధనల కారణంగా రైతులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, వాటిని తొలగించి ఎరువులను అందుబాటులో ఉంచాలని కోరారు.అలాగే ప్రభుత్వం రెండు నెలల క్రితం కొనుగోలు చేసిన మొక్కజొన్న పంటకు సంబంధించిన చెల్లింపులు ఇప్పటికీ రైతుల ఖాతాల్లో జమ కాకపోవడంతో రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని అన్నారు.సాగు పెట్టుబడుల కోసం రైతులు ప్రైవేటు అప్పులను ఆశ్రయించాల్సిన పరిస్థితి ఏర్పడిందని పేర్కొన్నారు.వెంటనే మొక్కజొన్న బకాయిలను రైతుల ఖాతాల్లో జమ చేయాలని డిమాండ్ చేశారు.మొబైల్ యాప్ విధానాన్ని రద్దు చేయడం, ఎరువుల సరఫరాను మెరుగుపరచడం,మొక్కజొన్న బకాయిల చెల్లింపులు వెంటనే చేపట్టాలని కోరుతూ నిర్వహించే ప్రదర్శన,ధర్నాలో రైతులు పెద్ద సంఖ్యలో పాల్గొనాలని ఆయన విజ్ఞప్తి చేశారు.ఈ సమావేశంలో ధరావత్ వెంకన్న, కొడెంరవి,రాయండ్ల కోటిలింగం,బానోత్ వెంకట్రాం తదితరులు పాల్గొన్నారు.

# చిరు వ్యాపారుల కల సాకారం

- డ్రైన్లపై నుంచి దుకాణాలకు
- అద్దెల తగ్గింపుతో లాటరీ ద్వారా షాపుల కేటాయింపు

**దమ్మపేట, జూన్ 23(ప్రజాజ్యోతి):** గ్రామపంచాయతీ ఆదాయ వనరులను పెంపొందించడంతో పాటు చిరు వ్యాపారులకు స్థిరమైన వ్యాపార అవకాశాలు కల్పించాలనే లక్ష్యంతో దమ్మపేట గ్రామపంచాయతీ ఆధ్వర్యంలో నిర్మించనున్న వాణిజ్య సముదాయంలోని షాపుల స్థలాలను మంగళవారం లాటరీ విధానంలో కేటాయించారు. గ్రామపంచాయతీ కార్యాలయంలో సర్పంచ్ పగడాల రమాదేవి రాంబాబు అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో షాపుల కేటాయింపు ప్రక్రియ పారదర్శకంగా నిర్వహించారు.ప్రధాన రహదారి డ్రైన్లపై వ్యాపారాలు నిర్వహిస్తూ ఇబ్బందులు ఎదుర్కొంటున్న చిరు వ్యాపారులకు ప్రాధాన్యత కల్పిస్తూ అర్హుల జాబితాను ప్రకటించారు. ప్రారంభంలో నిర్ణయించిన అద్దె మొత్తాలపై



కొందరు వ్యాపారులు అభ్యంతరం వ్యక్తం చేయగా, గ్రామస్థుల సూచనలను పరిగణనలోకి తీసుకున్న పాలకవర్గం వెంటనే స్పందించి ప్రతి షాపు అద్దెపై రూ.1000 చొప్పున తగ్గింపు ప్రకటించింది. ఈ నిర్ణయంతో వ్యాపారులు హర్షం వ్యక్తం చేశారు.అనంతరం అందరి సమక్షంలో లాటరీ నిర్వహించి షాపు స్థలాలను కేటాయించారు. ప్రధాన రహదారి వెంబడి ఉన్న ఆరు షాపులను నెలకు రూ.4000 అద్దెతో, మధ్య భాగంలోని షాపులను రూ.3000 అద్దెతో, వెనుక భాగంలోని షాపులను రూ. 2000 అద్దెతో కేటాయించారు. లాటరీ ప్రక్రియలో ఎంపికైన వారికి స్థలాల వివరాలు, కొలతలు తెలియజేశారు. ఈ సందర్భంగా కార్యదర్శి బండి అనంత్ కుమార్ మాట్లాడుతూ ప్రతి షాపుకు రూ.5000 చొప్పున డిపాజిట్ చెల్లించాల్సి ఉంటుందని, మొదటి నెల అద్దె మినహాయింపు ఉంటుందని తెలిపారు. గ్రామపంచాయతీ తరఫున ప్రతి షాపుకు విద్యుత్ సదుపాయం కల్పించడంతో పాటు వాణిజ్య సముదాయానికి మంచినీటి సౌకర్యం కూడా ఏర్పాటు చేస్తామని పేర్కొన్నారు. షాపుల నిర్మాణం ఒకే ప్రమాణాలతో ఉండేలా బేస్ మెంట్ ను సమాన స్థాయిలో నిర్మించాలన్నారు.షాపులలో మద్యం విక్రయాలు, మాంసం దుకాణాలు, పేలుడు పదార్థాల నిల్వలకు అనుమతి ఉండదని స్పష్టం చేశారు. షాపుదారులతో నాలుగు సంవత్సరాల కాలపరిమితితో ఒప్పందం కుదుర్చుకుని, అనంతరం పునరుద్ధరణకు అవకాశం కల్పిస్తామని తెలిపారు.గ్రామపంచాయతీ ఆధ్వర్యంలో నిర్మితమవుతున్న ఈ వాణిజ్య సముదాయం ద్వారా పంచాయతీకి స్థిరమైన ఆదాయం సమకూరడంతో పాటు గ్రామాభివృద్ధి కార్యక్రమాలకు మరింత ఊతం లభిస్తుందని సర్పంచ్ పేర్కొన్నారు. లాటరీలో షాపులు పొందిన వ్యాపారులు త్వరితగతిన నిర్మాణాలు చేపట్టి వ్యాపారాలను ప్రారంభించి ఆర్థికంగా అభివృద్ధి చెందాలని గ్రామ పెద్దలు, ప్రజాప్రతినిధులు ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ ఆంగోతు శ్రీనివాసరావు, వార్డు సభ్యులు పానుగంటి లక్ష్మణ్ గౌడ్, దారా రాము, రూపా రాంబాబు, బత్తుల సాయి, ఉయ్యాల లక్ష్మీనారాయణ, చాట్ల శ్రీను, పసుమర్తి కుసుమాంబ, దాసరోజు సరిత రామారావు, చిన్నశెట్టి నాగలక్ష్మి ముక్తేశ్వరరావు, గ్రామస్తులు షేక్ రహీం, చిన్నశెట్టి గోపి, పిట్టల శ్రీనివాసరావు, గట్ల నాగరాజు, జెట్టి వెంకటేశ్వరరావు, పంచాయతీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## టీచర్ల సర్దుబాటుపై ఆందోళన

- జూన్ 20 కటాఫ్‌పై విమర్శలు

**చర్ల, జూన్ 23(ప్రజా జ్యోతి ):** ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల నమోదు బడిబాట ప్రక్రియ ఇంకా కొనసాగుతున్న సమయంలోనే జూన్ 20 నాటి విద్యార్థుల సంఖ్యను ప్రామాణికంగా తీసుకొని ఉపాధ్యాయుల హేతుబద్ధ సర్దుబాటు చేపట్టాలని పాఠశాల విద్యాశాఖ జారీ చేసిన ఉత్తర్వులపై చర్ల మండల పిఆర్టియు అధ్యక్షుడు రవికుమార్ ఆందోళన వ్యక్తం చేసారు .ఈ సందర్భగా వారు మాట్లా డుతూ జూన్ నెలాఖరు వరకు విద్యార్థుల నమోదు ప్రక్రియ కొనసాగుతుండగా విద్యార్థులు పాఠశాలల్లో చేరే దశలోనే తక్కువ నమోదు ఉందనే కారణంతో ఉపాధ్యాయులను ఇతర పాఠశాలలకు తాత్కాలిక విధుల సర్దుబాటు పేరుతో పంపడం వల్ల ప్రభుత్వ పాఠశాలలపై తల్లిదండ్రుల్లో అపనమ్మకం పెరిగే అవకాశం ఉందని అన్నారు. పాఠశాల విద్యాశాఖ విడుదల చేసిన మిగులు ఉపాధ్యాయుల సర్దుబా టు ఉత్తర్వులు–2024 (ఆర్‌సీ నెం.1267/సర్వీస్–III–1/2024, తేదీ: 22-06-2026) ప్రకారం, జూన్ 20 నాటికి నమోదైన విద్యార్థుల సంఖ్య ఆధారంగా పాఠశాలల వారీగా విషయాల వారీగా ఉపాధ్యాయుల అవసరాలను విశ్లేషించి జిల్లా పరిధిలోనే మిగులు ఉపాధ్యాయులను అవసరమున్న పాఠశాలల్లో సర్దుబా టు చేయనున్నారు అని అలాగే తాత్కాలిక విధుల సర్దుబాటు ఆధారంగా పంపిన ఉపాధ్యాయులను 2026 ఏప్రిల్ 22 తర్వాత విధుల నుంచి విడుదల చేయవద్దని ప్రస్తుతం పనిచేస్తున్న పాఠశాలల్లో అవసరం ఉంటే అక్కడే కొనసాగించాలని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు అని పదవీ విరమణలు, దీర్ఘకాలిక సెలవులు లేదా ఇతర కారణాలతో ఏర్పడిన ఖాళీలను కూడా మిగులు ఉపాధ్యాయుల తాత్కాలిక నియామకాల ద్వారా భర్తీ చేయాలని సూచించారు అని అన్నారు.ఈ సర్దుబాటు ప్రక్రియను జిల్లా పాలనాధికారి కలెక్టర్ ఆమోదంతో మాత్రమే అమలు చేయాలని ఉత్తర్వుల్లో స్పష్టం చేశారు అని అయితే ఒకవైపు ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య పెంచి బలోపేతం చేయాలని ప్రభుత్వం చెబుతుండగా మరోవైపు విద్యార్థుల నమో దు పూర్తికాకముందే ఉపాధ్యాయుల హేతుబద్ధీకరణ చేపట్టడం సరైన విధానం కాదని అభిప్రాయపడుతున్నారు. దీంతో ప్రభుత్వ పాఠశాలల పట్ల తల్లిదండ్రుల్లో నమ్మకం దెబ్బతినే ప్రమాదం ఉందని అన్నారు.

## విత్తన మేళాతో వ్యవసాయ అవసరాలు సులభతరం

- పత్తిలో అంతర పంటగా కంది సాగు చేయాలి: ఏడీఏ రవి కుమార్
- రైతు మేళా నిర్వహించడం అభినందనీయం: సర్పంచ్ కుంజా వినోద్



**ములకలపల్లి, జూన్ 23(ప్రజాజ్యోతి ):** రైతులకు నాణ్యమైన విత్తనాలు, ఎరువులు ఒకే చోట అందుబాటులో ఉంచి వ్యవసాయ అవసరాలను సులభతరం చేయడమే విత్తన మేళా ముఖ్య ఉద్దేశమని వ్యవసాయ శాఖ అధికారులు తెలిపారు. మంగళవారం మండలంలోని ములకలపల్లి, జగన్నాథపురం రైతు వేదికల్లో నిర్వహించిన విత్తన మేళా కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో అశ్వారావుపేట వ్యవసాయ శాఖ సహాయ సంచాలకులు (ఏడీఏ) రవి కుమార్ పాల్గొని మాట్లాడారు., ప్రభుత్వం సూచించిన ఏడు సన్న రకాల వరి విత్తనాలను రైతులు సాగు చేయాలని సూచించారు. ఎల్‌నినో ప్రభావంతో వర్షపాతం తగ్గే అవకాశాలు ఉన్నందున ప్రత్యామ్నాయ పంటల సాగుపై దృష్టి సారించాలని, ముఖ్యంగా పత్తిలో అంతర పంటగా కందిని సాగు చేయడం ద్వారా రైతులకు అదనపు ఆదాయం లభిస్తుందని తెలిపారు. మండల వ్యవసాయ అధికారి బి. అరుణ్‌బాబు మాట్లాడుతూ, ఇకపై రైతు వేదికల్లో యూరియా ఎల్లప్పుడూ అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. అలాగే విత్తన మేళాల ద్వారా రైతులకు అవసరమైన వివిధ రకాల నాణ్యమైన విత్తనాలను రైతు వేదికల వద్దనే అందించే ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు. రైతులందరూ తప్పనిసరిగా ఫార్మర్ రిజిస్ట్రీలో నమోదు చేసుకోవాలని సూచించారు. జగన్నాథపురం సర్పంచ్ కుంజా వినోద్ మాట్లాడుతూ, రైతులకు అవసరమైన అన్ని రకాల నాణ్యమైన విత్తనాలు, యూరియా ఒకే చోట అందుబాటులో ఉంచడం అభినందనీయమని పేర్కొంటూ ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో రాచన్నగూడెం సర్పంచ్ మడకం విజయ, కమలాపురం సర్పంచ్ వగ్గెల రాధ, ఉపసర్పంచులు, ప్రజాప్రతినిధులు, రైతులు, వ్యవసాయ విస్తరణ అధికారులు రమేష్, రాహుల్, సుజాత, సూరిబాబు, ఎరువుల దుకాణాల డీలర్లు తదితరులు పాల్గొన్నారు.

## ఫిట్ నెస్ లేని బడి బస్సులపై చర్యలు తీసుకోవాలి



**కొత్తగూడెం, జూన్ 23 ( ప్రజాజ్యోతి )** జిల్లాలోని ప్రైవేట్, కార్పొరేట్ విద్యాసంస్థలకు చెందిన బస్సుల ఫిట్ నెస్ పై సమగ్ర తనిఖీలు నిర్వహించి నిబంధనలు ఉల్లంఘిస్తున్న యాజమాన్యాలపై చర్యలు తీసుకోవాలని ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి వరక అజిత్ డిమాండ్ చేశారు. మంగళవారం ఏఐఎస్ఎఫ్ జిల్లా సమితి ఆధ్వర్యంలో జిల్లా ఆర్టీవో రాజశేఖర్ కు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా అజిత్ మాట్లాడుతూ పరిమితికి మించి విద్యార్థులను బస్సుల్లో తరలిస్తూ ప్రమాదాలకు గురిచేస్తున్న విద్యాసంస్థలపై చర్యలు తీసుకోవాలని కోరారు. లైసెన్స్ లేని లేదా అర్హతలు లేని డ్రైవర్లను నియమించి విద్యార్థుల ప్రాణాలతో చెలగాటమాడుతున్న ప్రైవేట్, కార్పొరేట్ పాఠశాలలు, కళాశాలల యాజమాన్యాలపై చట్టపరమైన చర్యలు చేపట్టాలని విజ్ఞప్తి చేశారు. జిల్లా వ్యాప్తంగా ప్రైవేట్ విద్యాసంస్థలకు చెందిన 254 బడి బస్సులు ఉండగా ఇప్పటివరకు 156 బస్సులు మాత్రమే ఫిట్ నెస్ పరీక్షలు పూర్తి చేసుకున్నాయని, మిగిలిన 98 బస్సులు ఇంకా ఫిట్ నెస్ సర్టిఫికెట్లు పొందాల్సి ఉందని తెలిపారు. వీటిపై అధికారులు ప్రత్యేక నిఘా పెట్టాలని కోరారు. ప్రతి బస్సుకు తప్పనిసరిగా ఫిట్ నెస్ సర్టిఫికెట్, ఇన్సూరెన్స్, పర్మిట్, కాలుష్య నియంత్రణ పత్రాలు ఉండాలని, బస్సుల్లో అగ్నిమాపక పరికరాలు, ఫస్ట్ ఎయిడ్ బాక్స్, అత్యవసర ద్వారం సక్రమంగా ఉండేలా తనిఖీలు నిర్వహించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ జిల్లా సహాయ కార్యదర్శి ఇనపల్లి పవన్ సాయి, జిల్లా ఉపాధ్యక్షుడు కొరిమి సంజయ్, నాయకులు కళ్యాణ్, మహేష్ తదితరులు పాల్గొన్నారు.

## రజతోత్సవ శోభలో శ్రీ గాయత్రి ఆశ్రమం

- 25 వసంతాల ఆధ్యాత్మిక ప్రస్థానం..
- లోక కళ్యాణం కోసం విశేష పూజలు.. భక్తులకు గురూజీ పిలుపు



**దమ్మపేట, జూన్ 23(ప్రజాజ్యోతి)::** దమ్మపేట మండల కేంద్రంలోని శ్రీ గాయత్రి ఆశ్రమం 25వ వార్షికోత్సవ (సిల్వర్ జూబ్లీ) వేడుకలు మంగళవారం భక్తిశ్రద్ధల మధ్య ఘనంగా ప్రారంభమయ్యాయి. వేడుకల తొలి రోజు ఉదయం 5 గంటల నుంచే ఆశ్రమ ప్రాంగణం ఆధ్యాత్మిక శోభతో కళకళలాడింది.ఈ సందర్భంగా అమ్మవారికి అభిషేకం, ధూపహారతి, సహస్రనామ కుంకుమార్చన, త్రికుండీ గాయత్రి యజ్ఞం తదితర విశేష పూజా కార్యక్రమాలను నిర్వహించారు. ఆశ్రమ వ్యవస్థాపకులు ప్రేమ్ సుస్థిర గురూజీ దంపతులు భక్తులతో కలిసి ఈ కార్యక్రమాలను ఉచితంగా నిర్వహించి ఆశీర్వచనాలు అందించారు.అనంతరం దమ్మపేట, కొత్తగూడెం ప్రాంతాలకు చెందిన హనుమాన్ భక్తులు సమిష్టిగా హనుమాన్ చాలీసా పారాయణం నిర్వహించి భక్తి ప్రపత్తులను చాటారు. కార్యక్రమం అనంతరం ఆశ్రమం ఆధ్వర్యంలో భక్తులకు అన్నదాన సేవ నిర్వహించారు.బుధవారం గాయత్రి జయంతి సందర్భంగా రజతోత్సవ వేడుకలను మరింత వైభవంగా నిర్వహించనున్నట్లు ఆశ్రమ నిర్వాహకులు తెలిపారు. అమ్మవారికి విశేష పూజలు, సాంస్కృతిక కార్యక్రమాలు, అన్నా అమృత సేవలు నిర్వహించనున్నట్లు వెల్లడించారు.లోకకళ్యాణం, శాంతి, సౌభాగ్యాల కోసం నిర్వహిస్తున్న ఈ మహోత్సవాల్లో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని అమ్మవారి ఆశీస్సులు పొందాలని ఆశ్రమ వ్యవస్థాపకులు ప్రేమ్ సుస్థిర గురూజీ పిలుపునిచ్చారు.

# డ్రగ్స్‌కు దూరంగా ఉండి ఉజ్వల భవిష్యత్తు నిర్మించుకోండి

- ఎస్ఐ మధు ప్రసాద్



**ములకలపల్లి, జూన్ 23(ప్రజాజ్యోతి)**:యువత, విద్యార్థులు మాదక ద్రవ్యాల బారిన పడి తమ బంగారు భవిష్యత్తును నాశనం చేసుకోవద్దని ములకలపల్లి ఎస్ఐ మధు ప్రసాద్ సూచించారు. మంగళవారం స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల (జెడ్పీహెచ్ఎస్) ములకలపల్లిలో పోలీసుల ఆధ్వర్యంలో "మాదక ద్రవ్యాల వినియోగం – దుష్పరిణామాలు" అంశంపై ప్రత్యేక అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఐ మధు ప్రసాద్ మాట్లాడుతూ, నేటి సమాజంలో డ్రగ్స్, గంజాయి వంటి మాదక ద్రవ్యాలు యువతను పెడదోవ పట్టిస్తున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. క్షణికానందం కోసం అలవాటు పడే ఈ వ్యసనాల వల్ల ఆరోగ్యం దెబ్బతినడంతో పాటు ప్రాణాలు కోల్పోయే ప్రమాదం ఉందని, కుటుంబాలు కూడా తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటాయని హెచ్చరించారు. విద్యార్థి దశ నుంచే క్రమశిక్షణ, మంచి అలవాట్లు అలవరచుకోవాలని, స్నేహితుల ఒత్తిడికి లొంగి చెడు మార్గాల వైపు వెళ్లవద్దని సూచించారు. ఎవరైనా డ్రగ్స్ లేదా గంజాయి విక్రయిస్తున్నట్లు తెలిసినా, అనుమానాస్పద కార్యకలాపాలు గమనించినా వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని కోరారు. సమాచారం ఇచ్చిన వారి వివరాలు గోప్యంగా ఉంచుతామని తెలిపారు.పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

# మాదారం పోడు భూములను ఒక్క సెంటు కూడా వదిలేది లేదు

- పోడు రైతులకు వెంటనే హక్కు పత్రాలు ఇవ్వాలి
- తెలంగాణ రైతు సంఘం మండల కార్యదర్శి ఊకంటి రవికుమార్ డిమాండ్



**ములకలపల్లి, జూన్ 23, మంగళవారం, (ప్రజాజ్యోతి)**:మాదారం గ్రామంలోని పోడు సాగుదారులపై అటవీ శాఖ అధికారుల నిర్బంధ చర్యలను తక్షణమే నిలిపివేయాలని తెలంగాణ రైతు సంఘం (ఏఐకేఎస్) మండల కార్యదర్శి ఊకంటి రవికుమార్ డిమాండ్ చేశారు. మంగళవారం మాదారం గ్రామంలోని పోడు భూములను సాగుదారులతో కలిసి ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా రవికుమార్ మాట్లాడుతూ, మాదారం పోడు భూమిని ఒక్క సెంటు కూడా వదిలే ప్రసక్తే లేదని స్పష్టం చేశారు. పోడు సాగుదారులను అటవీ శాఖ అధికారులు బెదిరించడం మానుకోవాలని, వారిపై నమోదు చేసిన అక్రమ కేసులను వెంటనే ఎత్తివేయాలని కోరారు. ఏళ్ల తరబడి సాగు చేస్తున్న పోడు రైతులకు ప్రభుత్వం తక్షణమే పట్టాలు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. మాదారం పోడు రైతుల హక్కులను కాలరాసే ప్రయత్నాలను సహించబోమని హెచ్చరించారు. రైతులను భయభ్రాంతులకు గురిచేసే చర్యలు కొనసాగితే తెలంగాణ రైతు సంఘం ఆధ్వర్యంలో ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో చనగాని రాములు, నాగబాబు, ముదిగొండ వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

# నక్సలైట్ల డంప్ స్వాధీనం

- ఆయుధాలు, వైర్‌లెస్ సెట్లు, నక్సల్ సాహిత్యం స్వాధీనం







**చర్ల, జూన్ 23: (ప్రజా జ్యోతి )**:ఛత్తీస్‌గఢ్ రాష్ట్రంలోని కాంకేర్ జిల్లాలో భద్రతా బలగాలు మరో కీలక విజయాన్ని సాధించాయి. ఛోటేబెతియా పోలీస్ స్టేషన్ పరిధిలోని అమాటోలా సమీప అటవీ ప్రాంతంలో నిర్వహించిన సంయుక్త గాలింపు ఆపరేషన్‌లో నక్సలైట్లకు చెందిన డంప్‌ను గుర్తించి భారీ మొత్తంలో సామగ్రిని స్వాధీనం చేసుకున్నాయి.కాంకేర్ పోలీసులు, బీఎస్ఎఫ్, బీడీఎస్ బృందాలు ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు సరిహద్దు ప్రాంతాల్లో చేపట్టిన కూంబింగ్ ఆపరేషన్‌లో ఈ డంప్ వెలుగులోకి వచ్చింది. గాలింపు సందర్భంగా అనుమానాస్పద ప్రాంతాన్ని పరిశీలించగా నక్సలైట్లు దాచిపెట్టిన ఆయుధాలు, కమ్యూనికేషన్ పరికరాలు, ఇతర సామగ్రి లభ్యమయ్యాయి.స్వాధీనం చేసుకున్న వస్తువుల్లో 4 భర్మార్ తుపాకులు, 2 వైర్‌లెస్ సెట్లు, 1 రేడియో, 1 నక్సలైట్ యూనిఫాం, 2 పౌచ్‌లు, 1 ఛార్జర్, 1 బ్యాటరీతో పాటు నక్సల్ సాహిత్యం ఇతర నక్సలైట్ వినియోగ వస్తువులు ఉన్నాయి. ఆపరేషన్ అనంతరం సిబ్బంది సురక్షితంగా శిబిరానికి తిరిగి చేరుకున్నారు. జిల్లాలోని సున్నితమైన, మారుమూల అటవీ ప్రాంతాల్లో నక్సలైట్ల కదలికలను అరికట్టేందుకు ఇలాంటి సంయుక్త గాలింపు చర్యలు కొనసాగుతాయని అధికారులు అన్నారు

# రైతు వేదికల్లో విత్తన మేళా ప్రారంభం

- అన్నపురెడ్డిపల్లి, పెద్దిరెడ్డిగూడెం రైతు వేదికల్లో ధృవీకరించిన వరి విత్తనాల విక్రయాలు
- నాణ్యమైన విత్తనాలతో అధిక దిగుబడులు సాధించాలని రైతులకు సూచన



**అన్నపురెడ్డిపల్లి, జూన్ 23 (ప్రజా జ్యోతి)**:అన్నపురెడ్డిపల్లి మండల కేంద్రంలోని రైతు వేదికలో విత్తన మేళాను గ్రామ సర్పంచ్ లాకావత్ లక్ష్మి , ఉపసర్పంచ్ మరగాని అశోక్ ప్రారంభించారు. రైతులకు నాణ్యమైన, ప్రభుత్వం సూచించిన ధృవీకరించిన వరి విత్తనాలను అందుబాటులో ఉంచినట్లు తెలిపారు. రైతులు నకిలీ విత్తనాల బారిన పడకుండా అధికారికంగా విక్రయిస్తున్న విత్తనాలను మాత్రమే కొనుగోలు చేయాలని సూచించారు.అన్నపురెడ్డిపల్లి, పెద్దిరెడ్డిగూడెం రైతు వేదికల్లో ధృవీకరించిన వరి విత్తనాల విక్రయాలు చేపట్టినట్లు తెలిపారు. రైతులు తమ సాగు అవసరాలకు అనుగుణంగా విత్తనాలను కొనుగోలు చేసుకోవాలని కోరారు. విత్తనాల కొనుగోలు సమయంలో తప్పనిసరిగా బిల్లు రసీదు తీసుకోవాలని, పంట కాలం పూర్తయ్యే వరకు వాటిని భద్రపరచుకోవాలని సూచించారు. విత్తనాలకు సంబంధించిన ఏవైనా సమస్యలు తలెత్తినప్పుడు బిల్లు రసీదు ఆధారంగా సంబంధిత అధికారులను సంప్రదించవచ్చని వివరించారు.నాణ్యమైన విత్తనాల వినియోగంతో మెరుగైన దిగుబడులు సాధించే అవకాశం ఉంటుందని తెలిపారు. రైతులు వ్యవసాయ శాఖ సూచనలను పాటిస్తూ శాస్త్రీయ పద్ధతుల్లో సాగు చేపట్టాలని కోరారు. ప్రభుత్వం అందిస్తున్న సేవలను సద్వినియోగం చేసుకొని లాభదాయకమైన వ్యవసాయం వైపు అడుగులు వేయాలని సూచించారు. కార్యక్రమంలో వ్యవసాయ అధికారి అనూష, సహాయ వ్యవసాయ అధికారి సంధ్యారాణి, విత్తన డీలర్లు, రైతులు పాల్గొన్నారు.

# ఆరుతడి పంటలనే సాగు చేయండి

- వ్యవసాయ శాఖ అధికారి నవీన్ కుమార్
- భద్రాచలం వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో విత్తన మేళా



**భద్రాచలం టౌన్, జూన్ 23 , ప్రజాజ్యోతి** రైతులు ఎలినో ప్రభావం వలన ఆరుతడి పంటల వైపు మొగ్గు చూపాలని వ్యవసాయ శాఖ అధికారి నవీన్ కుమార్ అన్నారు. భద్రాచలంలోని రైతు వేదికలో మంగళవారం నుంచి ఈ నెల 30 వరకు విత్తన మేళా నిర్వహించనుండగా మేళాను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రైతులకు నాణ్యమైన విత్తనాలు, పప్పు ధాన్యాలు, ఆధునిక ఎరువుల వినియోగంపై అవగహన కల్పించడం జరుగుతుందన్నారు. ఈ వారం రోజుల పాటు వివిధ అంశాలపై అవగాహన కల్పించడంతో పాటు పలు రకాల విత్తనాలను విక్రయించడం జరుగుతుందన్నారు. మండల రైతులు సన్న వడ్లు, పప్పుదినుసులు, నూనె గింజలు, కూరగాయలను ఎక్కువగా పండించాలని తెలిపారు. అలాగే నానో యూరియా, నానో డీఏపీని ఉపయోగించాలని కోరారు. యూరియాను యాప్ ద్వార బుక్ చేసుకొని కొనుగోలు చేయాలన్నారు. అలాగే ఎలినో ప్రభావం వలన ఆరుతడి పంటలను మాత్రమే వేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో 19 షాపుల డీలర్లు పాల్గొన్నారు.

# ఘనంగా డా. శ్యామా ప్రసాద్ ముఖర్జీ వర్ధంతి



**ములకలపల్లి, జూన్ 23(ప్రజాజ్యోతి)**: భారతీయ జనతా పార్టీ మండల అధ్యక్షుడు గుగులోత్ శంకర్ నాయక్ ఆధ్వర్యంలో భారతీయ జనసంఘ్ వ్యవస్థాపకుడు డాక్టర్ శ్యామా ప్రసాద్ ముఖర్జీ వర్ధంతి కార్యక్రమాన్ని మంగళవారం మండల కేంద్రంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన బీజేపీ రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు అనుముల శ్రీనివాస్ మాట్లాడుతూ డాక్టర్ శ్యామా ప్రసాద్ ముఖర్జీ దేశ ఐక్యత, సమగ్రత కోసం చేసిన సేవలను స్మరించుకున్నారు. "ఒకే దేశంలో రెండు రాజ్యాంగాలు, ఇద్దరు ప్రధానులు, రెండు జెండాలు ఉండకూడదు" అనే నినాదంతో దేశ సమైక్యత కోసం ఆయన చేసిన పోరాటం, త్యాగం ప్రతి ఒక్కరికీ స్ఫూర్తిదాయకమని పేర్కొన్నారు. దేశ ప్రయోజనాలనే పరమావధిగా భావించి జీవించిన ముఖర్జీ ఆశయాల సాధన కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మండల ప్రధాన కార్యదర్శులు పూనెం నవీన్ కుమార్, అత్యం మణికంఠ సాయి, జిల్లా నాయకులు ఊకంటి మధుసూదన్ రావు, చీకటి ప్రకాశ్, కుంజా రాజారావు, మండల ఉపాధ్యక్షులు అర్చన రంగారావు, ఎర్రంశెట్టి శ్రీనివాస్, భానోత్ మల్లేష్, గుగులోత్ జేతు తదితరులు పాల్గొన్నారు.



## భద్రాద్రి మెచ్చిన కథ...

# పవన సుధ

- యూనిఫాం కలకు ఎన్‌సీసీ రూపం
- క్రమశిక్షణకు కమాండ్... క్యాడెట్లకు మార్గదర్శనం
- నాయకత్వాన్ని తీర్చిదిద్దుతున్న మహిళా అధికారి
- సవాళ్లను అవకాశాలుగా మలిచిన మహిళ
- తరగతి గది నుంచి పరేడ్ మైదానం వరకు

**ఎన్‌సీసీ (నేషనల్ క్యాడెట్ కార్ప్స్) అంటే కేవలం యూనిఫాం ధరించి పరేడ్ చేయడం మాత్రమే కాదు. అది క్రమ శిక్షణకు పునాది, దేశభక్తికి ప్రతీక, నాయకత్వానికి నాంది. యువతలో బాధ్యత, సేవాభావం, ఆత్మవిశ్వాసం, దేశం పట్ల అంకితభావాన్ని పెంపొందిస్తూ భవిష్యత్ పౌరులను తీర్చిదిద్దే మహత్తర వేదిక. అలాంటి వ్యవస్థలో మహిళా అధికారిగా రాణించడం సాధారణ విషయం కాదు. కుటుంబ బాధ్యతలు, వృత్తిపరమైన ఒత్తిళ్లు, వ్యక్తిగత సవాళ్లను అధిగమిస్తూ తన చిన్ననాటి యూనిఫాం కలకు కొత్త అర్థాన్ని ఇచ్చి, వేలాది మంది విద్యార్థుల జీవితాలకు దిశానిర్దేశం చేస్తున్న అసోసియేట్ ఎన్‌సీసీ ఆఫీసర్ వి.యస్. పవన సుధ ప్రస్థానం నిజంగా స్ఫూర్తిదాయకం. తనకు నెరవేరని కలను నిరాశగా మిగలనివ్వకుండా, అదే కలను వేలాది మంది క్యాడెట్ల భవిష్యత్తుగా మలిచిన ఆమె జీవన ప్రయాణం పట్టుదల, క్రమశిక్షణ, సేవాభావానికి నిదర్శనం. ఒక ఉపాధ్యాయురాలిగా ప్రారంభమైన ఆమె ప్రస్థానం, నేడు యువతలో నాయకత్వ లక్షణాలను పెంపొందించే మార్గదర్శకురాలిగా ఎదిగింది. మహిళలు సంకల్పం, అంకితభావంతో ముందుకు సాగితే ఎంతటి బాధ్యతలనైనా విజయవంతంగా నిర్వర్తించగలరని నిరూపిస్తున్న పవన సుధ విజయ ప్రస్థానంపై ప్రజాజ్యోతి ప్రత్యేక కథనం.**

● భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ప్రతినిధి, ప్రజాజ్యోతి

జీవితంలో ప్రతి ఒక్కరికీ కలలు ఉంటాయి. అయితే ప్రతి కల గమ్యాన్ని చేరదు. కొన్ని పరిస్థితుల కారణంగా మధ్యలోనే ఆగిపోతాయి. కానీ కొందరు ఆ ఆగిపోయిన కలలతోనే కొత్త చరిత్రను రాస్తారు. పవన సుధ అలాంటి వారిలో ఒకరు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా భద్రాచలం పట్టణానికి చెందిన వి.యస్. పవన సుధ చిన్ననాటి నుంచి యూనిఫాం ధరించాలని, పోలీస్ అధికారిగా దేశసేవ చేయాలని కలలు కనేవారు. వ్యక్తిగత కారణాల వల్ల ఆ దిశగా అడుగులు వేయలేకపోయినా ఆ కలను మాత్రం ఎన్నడూ వదులుకోలేదు. గమ్యం మారినా లక్ష్యం మారలేదు. చివరకు ఎన్‌సీసీ రూపంలో తన కలకు కొత్త అర్థాన్ని కనుగొన్నారు. నేడు ఆమె వ్యక్తిగత విజయానికి మాత్రమే ప్రతీక కాదు... వేలాది మంది విద్యార్థుల ఆశయాలకు మార్గదర్శకురాలిగా నిలుస్తున్నారు.

### ››› తరగతి గది నుంచి పరేడ్ మైదానం వరకు

సాధారణ మధ్యతరగతి కుటుంబానికి చెందిన పవన సుధ భద్రాచలంలోని జడ్పీ బాలికల ఉన్నత పాఠశాలలో పదో తరగతి పూర్తి చేశారు. అనంతరం ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్మీడియట్, ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో డిగ్రీ విద్యను అభ్యసించారు. ఖమ్మంలో హిందీ పండిట్ శిక్షణ పూర్తి చేశారు. విద్య పట్ల ఉన్న ఆసక్తితో కాకతీయ విశ్వవిద్యాలయం నుంచి హిందీలో ఎం.ఏ., పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం నుంచి తెలుగులో ఎం.ఏ. పట్టాలు సాధించారు. "విద్యాధనం సర్వధన ప్రధానమ్" అనే సూక్తిని జీవిత సూత్రంగా మార్చుకుని నిరంతర విద్యాభ్యాసాన్ని కొనసాగించారు. విద్యార్థులకు పాఠాలు బోధించే ఉపాధ్యాయురాలిగా ప్రారంభమైన ఆమె ప్రస్థానం, నేడు యువతలో క్రమశిక్షణ, నాయకత్వం, దేశసేవ భావనలను పెంపొందించే మార్గదర్శకురాలి స్థాయికి ఎదిగింది.

### ››› యూనిఫాం కలకు ఎన్ సిసిలో రూపం

విద్యాభ్యాసం పూర్తయిన తర్వాత ఓ ప్రయివేటు పాఠశాలలో ఉపాధ్యాయురాలిగా బాధ్యతలు స్వీకరించారు. అయితే యూనిఫాం ధరించి దేశానికి సేవ చేయాలన్న ఆమె చిన్ననాటి కోరిక మాత్రం కోరికగానే మిగిలిపోయింది. ఈ తరుణంలో ఆమె పనిచేస్తున్న విద్యా సంస్థ ద్వారా ఎన్‌సీసీలో సేవ చేసే అవకాశం లభించింది. ఆ అవకాశాన్ని సద్వినియోగం చేసుకున్న పవన సుధ గ్వాలియర్‌లో నిర్వహించిన పీఆర్‌సీఎన్ ప్రత్యేక శిక్షణను విజయవంతంగా పూర్తి చేసి 2014లో అసోసియేట్ ఎన్‌సీసీ ఆఫీసర్‌గా బాధ్యతలు స్వీకరించారు. అనంతరం రిఫ్రెషర్ కోర్సులను సైతం పూర్తిచేసి ఉన్నతాధికారుల ప్రశంసలను అందుకున్నారు. ఆ నిర్ణయం ఆమె జీవితంలో కీలక మలుపుగా నిలిచింది. చిన్ననాటి కలకు ఎన్‌సీసీ ద్వారా కొత్త రూపం లభించింది. అయితే అది వ్యక్తిగత విజయంగా మాత్రమే మిగలలేదు. ఆమె ధరించిన యూనిఫాం వేలాది మంది విద్యార్థుల్లో దేశభక్తి, క్రమశిక్షణ, సేవాభావం పెంపొందించే సాధనంగా మారింది. తనలోని స్ఫూర్తిని విద్యార్థుల్లో నింపుతూ ముందుకు సాగుతున్నారు.

### ››› క్రమశిక్షణకు కమాండ్... క్యాడెట్లకు మార్గదర్శనం

పవన సుధ దృష్టిలో ఎన్‌సీసీ ఒక సంస్థ మాత్రమే కాదు... వ్యక్తిత్వ వికాసానికి పునాది వేసే పాఠశాల. సమయపాలన, క్రమశిక్షణ, బాధ్యత, సేవాభావం, నాయకత్వం వంటి విలువలను యువతలో పెంపొందించడంలో ఎన్‌సీసీ కీలక పాత్ర పోషిస్తుందని ఆమె విశ్వసిస్తారు. ఆమె శిక్షణలో పెరిగిన అనేక మంది క్యాడెట్లు రాష్ట్ర, జాతీయ స్థాయి శిబిరాలకు ఎంపికై ప్రతిభ చాటుకున్నారు. గణతంత్ర దినోత్సవం, స్వాతంత్ర్య దినోత్సవ పరేడ్‌లు, యోగా దినోత్సవాలు, అవగాహన ర్యాలీలు, సామాజిక కార్యక్రమాల్లో పాల్గొని గుర్తింపు పొందారు. అయితే ఆమె దృష్టిలో అసలైన విజయం పతకాలు, ప్రశంసాపత్రాలు కాదు. ఒక సాధారణ విద్యార్థి ఆత్మవిశ్వాసంతో కూడిన బాధ్యతాయుత పౌరుడిగా ఎదగడమే నిజమైన విజయం అని చెబుతారు.

### ››› నాయకత్వాన్ని తీర్చిదిద్దుతున్న మహిళా అధికారి

కుటుంబ బాధ్యతలు, ఉపాధ్యాయ వృత్తి, ఎన్‌సీసీ విధులు... ఈ మూడు బాధ్యతలను సమన్వయం చేయడం చిన్న విషయం కాదు. శిబిరాలు, పరేడ్‌లు, శిక్షణ కార్యక్రమాలు, విద్యార్థుల పర్యవేక్షణ... ప్రతి బాధ్యతను అంకితభావంతో నిర్వర్తిస్తూ ఆమె ఆదర్శంగా నిలిచారు. పట్టుదల, క్రమశిక్షణ, ఆత్మవిశ్వాసం ఉంటే ఏ సవాలునైనా అధిగమించవచ్చని తన జీవితంతోనే నిరూపించారు.

### ››› సమాజసేవలో ముందడుగు

పవన సుధ శిక్షణలో ఎన్‌సీసీ క్యాడెట్లు కేవలం పరేడ్‌లకే పరిమితం కాలేదు. వృక్షారోపణ కార్యక్రమాలు, పరిశుభ్రత కార్యక్రమాలు, రక్తదాన శిబిరాలు, అవగాహన ర్యాలీలు, విపత్తు నిర్వహణ కార్యక్రమాల్లో చురుకుగా పాల్గొన్నారు. సమాజం పట్ల బాధ్యత కలిగిన యువతను తీర్చిదిద్దడమే నిజమైన దేశసేవ అని ఆమె విశ్వసిస్తారు. దేశసేవ సమాజసేవతోనే ప్రారంభమవుతుందనే భావనను ప్రతి క్యాడెట్‌లో నాటేందుకు నిరంతరం కృషి చేస్తున్నారు.

### ››› అవార్డుల వెనుక అంకితభావం

ఎన్‌సీసీ రంగంలో 2014 నుంచి సేవలందిస్తున్న పవన సుధ తన కృషికి అనేక గుర్తింపులు అందుకున్నారు. 2017లో యూనిట్ స్థాయిలో ఉత్తమ అసోసియేట్ ఎన్‌సీసీ ఆఫీసర్ అవార్డు, 2018లో డిప్యూటీ డైరెక్టర్ జనరల్ ప్రశంసాపత్రం, భద్రాద్రి మహిళా సమితి నారీ అవార్డు, అవార్డీ టీచర్స్ అసోసియేషన్ నుంచి ఉత్తమ ఎన్‌సీసీ అధికారి అవార్డు అందుకున్నారు. 2022లో ఉత్తమ విద్యావేత్త అవార్డు దక్కగా, 2017 మరియు 2025 సంవత్సరాల్లో పాఠశాల యాజమాన్యం నుంచి వంద శాతం హాజరు అవార్డు అందుకున్నారు. 2017 నుంచి ప్రతి సంవత్సరం గణతంత్ర దినోత్సవం సందర్భంగా ఐటీసీ–పీఎస్‌పీడీ భద్రతా విభాగం నుంచి ప్రశంసా స్మారక చిహ్నాలు అందుకుంటున్నారు. వివిధ శిబిరాలు, శిక్షణ కార్యక్రమాల్లో అందించిన సేవలకు గుర్తింపుగా అనేక ప్రశంసాపత్రాలు, సన్మానాలు అందుకున్నారు.

### ››› క్యాడెట్లే నా అసలైన అవార్డు



పవన సుధ మార్గదర్శకత్వంలో ఇప్పటి వరకు 5,000 మందికి పైగా విద్యార్థులు ఎన్‌సీసీలో నమోదు అయ్యారు. వారిలో అనేక మంది రాష్ట్ర, జాతీయ స్థాయి శిబిరాలకు ఎంపికై ప్రతిభ చాటుకున్నారు. 2019లో సికింద్రాబాద్‌లో జరిగిన ప్రీ–రిపబ్లిక్ డే శిబిరంలో పాల్గొని సంస్థకు గౌరవం తీసుకువచ్చారు. అవార్డులు, ప్రశంసలు, సన్మానాలు వచ్చినప్పటికీ ఆమె దృష్టిలో అసలైన విజయం మాత్రం క్యాడెట్ల అభివృద్ధే. "ఒక విద్యార్థి ఆత్మవిశ్వాసంతో ముందుకు సాగడం, సమాజానికి ఉపయోగపడే పౌరుడిగా ఎదగడం కంటే పెద్ద గుర్తింపు నాకు లేదు" అని ఆమె వినయంగా చెబుతారు.

### ››› ఉన్నతాధికారుల ప్రశంసలు



11 తెలంగాణ బెటాలియన్ ఎన్‌సీసీ, ఖమ్మం కమాండింగ్ ఆఫీసర్ కల్నల్ సంజయ్ కుమార్ భద్ర పవన సుధ సేవలను ప్రశంసిస్తూ ఆమెను తెలివైన, సమర్థవంతమైన, క్యాడెట్ల సంక్షేమానికి అంకితభావంతో పనిచేసే అధికారిగా అభివర్ణిస్తున్నారు. విద్యార్థులతో సత్సంబంధాలు నెలకొల్పుతూ వారి వ్యక్తిత్వ వికాసానికి నిరంతరం కృషి చేస్తున్నారని పేర్కొంటున్నారు. శిబిరాలు, పోటీలు, శిక్షణ కార్యక్రమాల్లో క్యాడెట్లకు గరిష్ఠ అవకాశాలు కల్పించేందుకు ఆమె చూపుతున్న చొరవ, బాధ్యతాయుత వైఖరి సంస్థకు ఎంతో విలువైనదని అభిప్రాయపడుతున్నారు. ఉన్నత బాధ్యతలను సమర్థంగా నిర్వహించగల నాయకత్వ లక్షణాలు ఉన్న అధికారిగా ఆమెను గుర్తిస్తూ, మరింత ఉన్నత స్థాయి బాధ్యతలకు అర్హురాలని పేర్కొన్నారు.

### ››› మా అమ్మ నా తొలి కమాండర్



జి.ఎన్.వి. తేజస్విని (ఎన్‌సీసీ క్యాడెట్)

పవన సుధ కూతురు అభిప్రాయం ఆమె వ్యక్తిత్వానికి మరో కోణాన్ని ఆవిష్కరిస్తుంది. "నాకు మా అమ్మ కేవలం తల్లి మాత్రమే కాదు. నా జీవితానికి దిశ చూపిన మార్గదర్శి. ఇంట్లో ప్రేమగా చూసుకునే అమ్మ, ఎన్‌సీసీలో మాత్రం క్రమశిక్షణ నేర్పే గురువు. నేను ఎన్‌సీసీలో చేరడానికి, ఏ సర్టిఫికేట్ నుంచి బి, సి సర్టిఫికేట్ల వరకు పూర్తి చేయడానికి మా అమ్మే ప్రేరణ. నేను సాధించిన ప్రతి విజయానికి ఆమె ప్రోత్సాహమే పునాది" అని గర్వంగా చెబుతోంది. "ఒక తల్లిగా, ఒక గురువుగా, ఒక మార్గదర్శిగా, ఒక ప్రేరణగా మా అమ్మ నా జీవితంలో ప్రత్యేక స్థానాన్ని సంపాదించారు" అని భావోద్వేగంగా పేర్కొంది. ఒకప్పుడు యూనిఫాం ధరించాలని కలలు కన్న ఓ బాలిక, నేడు అదే యూనిఫాం స్ఫూర్తితో వేలాది మంది యువతలో క్రమశిక్షణ, బాధ్యత, నాయకత్వ లక్షణాలను పెంపొందిస్తోంది. వ్యక్తిగతంగా నెరవేరని కలను నిరాశగా మిగలనివ్వకుండా, దానినే సమాజానికి ఉపయోగపడే యువశక్తి నిర్మాణానికి పునాదిగా మలచుకుంది. అవార్డులు, ప్రశంసలు, గుర్తింపుల కంటే తన శిక్షణలో తీర్చిదిద్దిన క్యాడెట్ల విజయాలనే గొప్ప సంపదగా భావిస్తున్న పవన సుధ, క్రమశిక్షణతో కూడిన సమాజ నిర్మాణంలో తనవంతు పాత్రను నిరంతరం పోషిస్తున్నారు. యూనిఫాం అనేది కేవలం వస్త్రధారణ కాదని, అది బాధ్యతకు ప్రతీక అని; నాయకత్వం అనేది పదవి కాదని, సేవ ద్వారా సంపాదించుకునే గౌరవమని తన జీవిత ప్రయాణంతో నిరూపిస్తూ భద్రాద్రికే కాదు, భావితరాలకు సైతం స్ఫూర్తిగా నిలుస్తున్నారు.

# మత్తు మహమ్మారిపై సమరశంఖం

- విద్యార్థులే దేశ భవిష్యత్తు..
- యువత మత్తుకు కాదు.. లక్ష్యాలకు బానిస కావాలి.. జడ్జి భవాని
- మాదకద్రవ్యాల బారిన పడొద్దు.. విద్యార్థులకు పోలీసుల సూచనలు





**దమ్మపేట, జూన్ 23(ప్రజాజ్యోతి):** నేటి యువతను నిశ్శబ్దంగా కబళిస్తున్న మాదకద్రవ్యాల మహమ్మారి సమాజానికి పెను సవాలుగా మారుతోంది. క్షణిక ఆనందం కోసం వ్యసనాలకు బానిసవుతున్న యువకులు తమ బంగారు భవిష్యత్తును కోల్పోవడంతో పాటు కుటుంబాలు, సమాజాన్ని కూడా సంక్షోభంలోకి నెడుతున్నారు. నేటి సమాజాన్ని పట్టిపీడిస్తున్న మాదకద్రవ్యాల వ్యసనం యువత జీవితాలను చీకటిలోకి నెడుతుండగా, భవిష్యత్తు తరాలను కాపాడేందుకు అవగాహనే ప్రధాన ఆయుధమని విద్యార్థి దశలోనే మత్తు పదార్థాలకు దూరంగా ఉండి విద్య, క్రీడలు, క్రమశిక్షణ, నైతిక విలువలను అలవర్చుకుంటేనే ఉన్నత భవిష్యత్తును నిర్మించుకోవచ్చని దమ్మపేటలోని తెలంగాణ గిరిజన సంక్షేమ గురుకుల బాలుర పాఠశాల – కళాశాలలో మాదకద్రవ్యాల వ్యతిరేక అవగాహన కార్యక్రమం ఘనంగా నిర్వహించారు.

### ››› భవిష్యత్తును నాశనం చేసే మత్తు వ్యసనాలు

కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన దమ్మపేట జడ్జి భవాని మాట్లాడుతూ యువతను లక్ష్యాల నుండి దూరం చేసి నేరాల బాట పట్టించే ప్రధాన కారణాల్లో మాదకద్రవ్యాల వినియోగం ఒకటని అన్నారు. మత్తు పదార్థాలకు అలవాటు పడిన వ్యక్తి తన ఆరోగ్యాన్ని, కుటుంబ గౌరవాన్ని, ఆర్థిక స్థితిని కోల్పోయే ప్రమాదం ఉందని హెచ్చరించారు. విద్యార్థులు తమ జీవిత లక్ష్యాలపై దృష్టి సారించి సమాజానికి ఆదర్శంగా నిలవాలని సూచించారు.

### ››› చట్టపరమైన చర్యలు కఠినం

అశ్వారావుపేట సర్కిల్ ఇన్‌స్పెక్టర్ నాగరాజు రెడ్డి మాట్లాడుతూ మాదకద్రవ్యాల అక్రమ రవాణా, విక్రయాలు, వినియోగంపై ప్రభుత్వం కఠిన చర్యలు చేపడుతోందని తెలిపారు. విద్యార్థులు ఎలాంటి ప్రలోభాలకు లోనుకాకుండా అప్రమత్తంగా ఉండాలని, అనుమానాస్పద కార్యకలాపాలపై వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని కోరారు.సబ్ ఇన్‌స్పెక్టర్లు రాజేష్‌కుమార్, బాలస్వామి మాట్లాడుతూ మాదకద్రవ్యాల వ్యసనం ఒక్క వ్యక్తినే కాదు మొత్తం కుటుంబాన్ని ఇబ్బందులకు గురిచేస్తుందని వివరించారు.యువత తమ సమయాన్ని సృజనాత్మక కార్యక్రమాలకు వినియోగించాలని సూచించారు.

### ››› విద్యార్థులే దేశ భవిష్యత్తు

దమ్మపేట బార్ అసోసియేషన్ అధ్యక్షుడు మురళి మాట్లాడుతూ విద్యార్థి దశలో ఏర్పడే మంచి అలవాట్లు జీవితాంతం విజయానికి పునాది అవుతాయని అన్నారు. విద్య, క్రీడలు, సామాజిక సేవా కార్యక్రమాల్లో పాల్గొంటూ వ్యక్తిత్వ వికాసాన్ని పెంపొందించుకోవాలని సూచించారు.

### ››› దుష్పరిణామాలపై అవగాహన- విద్యార్థుల ప్రతిజ్ఞ

మాదకద్రవ్యాల వల్ల కలిగే ఆరోగ్య సమస్యలు, మానసిక ఒత్తిడి, కుటుంబ కలహాలు, ఆర్థిక నష్టాలు, నేరప్రవృత్తి వంటి అనేక దుష్పరిణామాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. మత్తు పదార్థాలకు దూరంగా ఉంటూ ఆరోగ్యకరమైన జీవన విధానాన్ని అలవర్చుకోవాలని సూచించారు.పాల్గొన్న విద్యార్థులు మాదకద్రవ్యాలకు దూరంగా ఉంటామని, తమ తోటి విద్యార్థుల్లో కూడా అవగాహన కల్పిస్తామని ప్రతిజ్ఞ చేశారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రిన్సిపాల్ వీరస్వామి, సీతారాం మాట్లాడుతూ ఇటువంటి కార్యక్రమాలు విద్యార్థుల్లో సామాజిక బాధ్యతను పెంపొందిస్తాయని తెలిపారు.ఈ కార్యక్రమంలో బార్ కౌన్సిల్ సభ్యులు, ఉపాధ్యాయులు,సిబ్బంది, విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



## ప్రైవేట్ విద్యాసంస్థల ఇష్టారాజ్యం

- ప్రైవేటు పాఠశాలల్లో అడ్డగోలుగా ఫీజుల వసూలు
- పాఠశాలలో యూనిఫామ్, పుస్తకాల విక్రయం
- విద్యా హక్కు చట్టానికి తూట్లు
- లబోదిబోమంటున్న తల్లిదండ్రులు
- ఉదాసీన వైఖరి లో విద్యాశాఖాధికారులు
- ఎన్ఎస్ఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి దుర్గం ప్రేమ్ కుమార్




**పినపాక,కరకగూడెం 23(ప్రజాజ్యోతి)** మణుగూరు, పినపాక, కరక గూడెం, అశ్వాపురం, మండల పరిధిలోని ప్రైవేటు విద్యాసంస్థలు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తూ అడ్డగోలుగా ఫీజులు వసూలు చేస్తున్నారని ఎన్ఎస్ఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి దుర్గం ప్రేమ్ కుమార్ అన్నారు. బుధవారం ప్రైవేటు విద్యా సంస్థల దోపిడీ పై ఒక పత్రికా ప్రకటనలో తెలియజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ...విద్య ను వ్యాపార ధోరణితో యజమాన్యాలు వ్యవహరిస్తుండటంతో సామాన్యుడికి ఉన్నత విద్య అందని ద్రాక్షగా మారుతోందని, ఎంతో కష్టపడి సంపాదించినదంతా పిల్లల చదువు కే ఖర్చవుతుండడంతో పేద, మధ్య తరగతి వారు ఆర్థికంగా తీవ్ర ఇబ్బందులు పడాల్సి వస్తుంది అన్నారు. ప్రైవేట్ కార్పొరేట్ విద్యా సంస్థ ల్లో చదివించాలంటే తల్లిదండ్రులు జంకుతున్నారని, విద్యను వ్యాపారంగా మార్చిన ప్రైవేటు విద్యా సంస్థలు ఇష్టారీతిన ఫీజులు వసూళ్లు చేస్తున్నారని, తమ పిల్లలను ప్రైవేటు స్కూళ్లలో చదివించాలనే తల్లిదండ్రుల ఆకాంక్షను తమకు అనుకూలంగా మార్చుకుంటున్నారని అన్నారు. పాఠశాలల్లో ఫీజుల కు తోడు ఏకరూప దుస్తులు, పుస్తకాలు, నోట్బుక్ లు, బస్సు ఫీజు లంటూ ముక్కుపిండి వసూలు చేస్తున్నారన్నారు. ఈ విద్యా సంవత్సరం ప్రారంభమవుతుంది అంటే చాలు తల్లిదండ్రులు భయపడే పరిస్థితులు నెలకొన్నాయని .. కొంత మంది వడ్డీలకు డబ్బులు తీసుకువచ్చి పిల్లలను చదివిస్తూ అప్పుల పాలవుతున్నారని అన్నారు.. మణుగూరు, పినపాక, అశ్వాపురం కరక గూడెం మండలం లోప్రైవేటు పాఠశాలలు ఉండగా, మన ఊరు–మన బడి కార్యక్రమం చేపట్టినా కూడా ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థుల ప్రభుత్వం సంఖ్య ను పోయిందన్నారు. పెంచలేకఫీజులతో పాటు పుస్తకాల రేట్లు పెంచితే నిరసన సెగ తప్పదు.గత ఏడాది కన్నా ఈ విద్యా సంవత్సరం ప్రైవేట్, కార్పొరేట్ పాఠశాలలు 10 నుంచి 20 శాతం వరకు ఫీజులను పెంచాయని దీనికి తోడు పుస్తకాలు, నోటు పుస్తకాల రేట్లు 30 శాతం పెరగడం తల్లిదండ్రులకు అదనపు భారంగా మారిందన్నారు. కార్పొరేట్ పాఠశాల లో అడ్మిషన్ కోసం అధిక ఫీజులు వసూలు చేయడంతో తల్లిదండ్రులు లబోదిబోమంటున్నారని, ఇంత జరుగుతున్నా విద్యాశాఖ అధికారులు ఉదాసీనంగా వ్యవహరిస్తున్నారని అన్నారు. ప్రైవేట్ విద్యా సంస్థల్లో ఫీజుల దోపిడీని నియంత్రించకపోతే ఎన్ ఎస్ ఎఫ్ తరపున ధర్నాలు, నిరసన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు. జి ఓ నెం (1) ప్రకారం ప్రభుత్వ పాఠశాల పుస్తకాల నే ప్రైవేటు పాఠశాలల్లో వినియోగించాలని, అడ్మిషన్ ఫీజు వసూలు చేయడానికి ఎలాంటి అనుమతులు లేవని ఆయన పేర్కొన్నారు. అడ్మిషన్ ఫీజు ఎవరైనా వసూలు చేసినట్లు మా దృష్టికి తీసుకువస్తే తగిన చర్యలు చేపడతామని ఎం ఈ ఓ లు తెలిపినా ప్రైవేట్ యాజమాన్యాలు మాత్రం పెడ చెవిన పెడుతున్నాయని అన్నారు. కేవలం ట్యూషన్ ఫీజు మాత్రమే వసూలు చేయాలని, ఫీజులు నియంత్రించేందుకు తల్లిదండ్రులతో కలిసి ప్రైవేటు పాఠశాల యాజమాన్యాలు కమిటీ లు వేయాలని సూచించారు. అధిక ఫీజులు ఎవరు వసూలు చేస్తే చర్యలు తప్పవని ఆయన హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో భద్రాది జిల్లా యూత్ లీడర్ గోగు సాయి, మండల అధ్యక్షులు శ్రీనివాస్, నియోజకవర్గ ఇన్చార్జి జాడి దినేష్, రాజు సురేష్ మహేష్ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

## నేటి నుంచి 17వ విడత సామాజిక తనిఖీలు

- ఉపాధి హామీ పనులు, పెన్షన్లు, డ్వాక్రా గ్రూపులపై సమగ్ర ఆడిట్
- అన్ని శాఖలు సహకరించాలి: ఎంపీడీవో రవీంద్రారెడ్డి





**దమ్మపేట, జూన్ 23(ప్రజాజ్యోతి):** ప్రభుత్వ సంక్షేమ పథకాల అమలు, అభివృద్ధి పనుల్లో పారదర్శకత, జవాబుదారీతనాన్ని నిర్ధారించేందుకు నిర్వహించే 17వ విడత సామాజిక తనిఖీలు (సోషల్ ఆడిట్) దమ్మపేట మండలంలో బుధవారం నుంచి ప్రారంభం కానున్నాయని సామాజిక తనిఖీ రిసోర్స్ పర్సన్ (ఎస్ఆర్పీ) కుమార్ తెలిపారు. ఈ మేరకు మండల పరిషత్ అభివృద్ధి కార్యాలయంలో నిర్వహించిన సమన్వయ సమావేశంలో ఆయన మాట్లాడారు.2025–26 ఆర్థిక సంవత్సరంలో చేపట్టిన మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం పనులు, ప్రజా ప్రతినిధుల నిధులతో చేపట్టిన అభివృద్ధి పనులు, సామాజిక భద్రతా పెన్షన్లు, డ్వాక్రా మహిళా సంఘాల కార్యకలాపాలపై సామాజిక తనిఖీలు నిర్వహించనున్నట్లు తెలిపారు.ఈ సందర్భంగా ఎంపీడీవో బి. రవీంద్రారెడ్డి మాట్లాడుతూ సంబంధిత శాఖల అధికారులు, సిబ్బంది అవసరమైన రికార్డులు, పత్రాలు పూర్తిస్థాయిలో అందుబాటులో ఉంచి ఆడిట్ ప్రక్రియను విజయవంతం చేయాలని సూచించారు. సామాజిక తనిఖీలు ప్రభుత్వ పథకాల అమలుపై ప్రజలకు స్పష్టత కల్పించడంతో పాటు లోపాలను గుర్తించి సరిదిద్దుకునే అవకాశాన్ని కల్పిస్తాయని అన్నారు.ఎంపీఓ డి. రామారావు మాట్లాడుతూ గ్రామపంచాయతీ కార్యదర్శులు తమ తమ గ్రామాల్లో అందుబాటులో ఉండి ఆడిట్ బృందాలకు పూర్తి సహకారం అందించాలని, తనిఖీ సిబ్బందికి అవసరమైన వసతి సౌకర్యాలు కల్పించాలని సూచించారు.ఏపీఓ వి. సుధాకర్ మాట్లాడుతూ టెక్నికల్ అసిస్టెంట్లు (టీఏలు), ఫీల్డ్ అసిస్టెంట్లు (ఎఫ్ఏలు) అందుబాటులో ఉండి చేపట్టిన పనులను ఆడిట్ బృందాలకు చూపించి, అవసరమైన వివరాలు అందించాలని కోరారు.ఈ సమావేశంలో సోషల్ ఆడిట్ డీఆర్పీలు, గ్రామపంచాయతీ కార్యదర్శులు, టెక్నికల్ అసిస్టెంట్లు, ఫీల్డ్ అసిస్టెంట్లు తదితరులు పాల్గొన్నారు.